ప్రజాశక్తి
సోమవారం 24 జులై 2023 8 పేజీలు
గుంటూరు పల్నాడు

నేడు రాజధానికి సిఎం జగన్

- రాజధానిలో ప్రతిష్టాత్మకంగా ఇళ్ల నిర్మాణం
- నేడు శంకుస్థాపన చేయనున్న ముఖ్యమంత్రి
- కోర్టు తీర్పులు ఆటంకం కాదు : మంత్రి సురేష్

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

రాజధాని గ్రామాల్లో ఆర్-5జోన్ పరిధిలో గుంటూరు, ఎన్‌టిఆర్ జిల్లాలకు చెందిన పేదలకు కేటాయించిన స్థలాల్లో ఇళ్ల నిర్మాణానికి సోమవారం సిఎం జగన్ శంకుస్థాపన చేయనున్నారు. రెండేళ్లుగా ఇళ్లస్థలాల పంపిణీపై ఎన్నో వివాదాలు ఏర్పడగా మే 26న సిఎం జగన్ వెంకటపాలెంలో 50,793 మందికి ఇళ్ల స్థలాల పంపిణీని ప్రారంభించారు. ఇళ్లస్థలాల పంపిణీపై ప్రతిపక్షాలు,రైతులు ఎన్ని విమర్శలు చేసినా ప్రభుత్వం వెనక్కి తగ్గలేదు. పేదలకు ఇళ్లనిర్మిస్తే రాజధానిలో డెమోగ్రాఫిక్ ఇన్ బ్యాలెన్స్ వస్తుందని హైకోర్టులో అనేక మంది పిటీషన్లు దాఖలు చేశారు. ఇందుకు ప్రభుత్వం పలు మార్లు కౌంటర్లు దాఖలు చేసింది. పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేసి తీరాలని పట్టుదలతో ప్రయత్నించింది. సుదీర్ఘ విచారణ అనంతరం స్థలాల పంపిణికి సుప్రీంకోర్టు పచ్చజెండా ఊపడంతో గతనెల 26 నుంచి స్థలాలు పంపిణీ ప్రారంభమైంది.

మొత్తం 25 లేఅవుట్లలో తగిన మౌలికసదుపాయాలతో గుంటూరు, ఎన్‌టిఆర్ జిల్లాలకు చెందిన వారికి స్థలాలతో పాటు వెంటనే ఇళ్ల మంజూరు చేశారు. మొత్తం 47 వేల ఇళ్ల నిర్మాణం చేపటనున్నారు. తొలిదశలో 35 వేల ఇళ్లను షేర్ వాల్ టెక్నాలజీ తో తక్కువ ఖర్చుతో, వేగంగా నిర్మాణాలు చేస్తున్నట్టు మంత్రి ఆదిమూలపు సురేష్ ఆదివారం వెంకటపాలెంలో తెలిపారు. కోర్టు తీర్పులు ఇళ్ల నిర్మాణానికి ఆటంకం కావని భావిస్తున్నట్టు ఆయన చెప్పారు. ఈ మేరకు ఇప్పటికే మంగళగిరి మండలం కృష్ణాయ పాలెంలో నిర్మించిన నమూనా గృహాలను ఆయన పరిశీలించారు. వీటిని సోమవారం సిఎం జగన్ కూడా పరిశీలిస్తారు. ఒక్కొ ఇంటికి రూ.2.11 లక్షలు కేటాయించారు. రాజధానిలో పేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వడంపై ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా వ్యవహరిస్తోంది. రాజధానిలో టిడిపి హయంలో జనాభా ఏమాత్రం పెరగలేదని తమ హయంలో ఎన్నివేల మంది కొత్త

2లో

కృష్ణాయపాలెం లే అవుట్‌లో వర్షపు నీరు

సిఎం సభకు వాన భయం

ప్రజాశక్తి - తుళ్లూరు

సిఎం పర్యటనకు వాన భయం వెంటాడుతోంది. ఆదివారం ఉదయం, సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. దీంతో సోమవారం జరిగే గహ నిర్మాణాలకు శంకు స్థాపన, బహిరంగ సభకు వర్షం ఇబ్బందులు తెచ్చిపెడుతుందేమోనన్న ఆందోళన ప్రజా ప్రతినిధులు, అధికారులు, వైసిపి అభిమానుల్లో వ్యక్తమవుతోంది. సిఎం రాకను పురస్కరించుకొని అధికారులు లే అవుట్‌లో షేర్‌వాల్ టెక్నాలజీ వినియోగించి ఒక నమూనా ఇంటిని నిర్మించగా దీన్ని సిఎం క్షుణ్ణంగా పరిశీలిస్తారని అధికారులు చెబుతున్నారు. సిఎం వస్తున్న నేపథ్యంలో లే అవుట్‌లో స్థలాల చదును పనులు జరుగుతున్నాయి. స్థలాలలో నిలిచిన నీటిని ప్రొక్లయినర్‌తో తీసిన కాల్వలోకి మరలిస్తున్నారు. లే అవుట్‌లో పచ్చదనం కోసం మొక్కలను సిద్ధం చేశారు. వెంకటపాలెంలో సిఎం సభకు దారితీసే మార్గాల్లో పరిశుభ్రత పనులను పంచాయతీ, పారిశుధ్య కార్మికులతో చేయిస్తున్నారు. మందడం పంచాయతీ కార్యాలయం నుంచి సమీపంలోని వాగు వరకు రోడ్డుపై గ్రావెల్ తోలి చదును చేస్తున్నారు. వర్షం కురుస్తున్నా పనులు చకచకా సాగుతున్నాయి. వర్షాలు కురుస్తాయన్న సమాచారంతో సభ సజావుగా సాగుతుందా? లేదా? అనే సందేహాలు తలెత్తుతున్నాయి.

వరికపూడిశెల పనులను చేపట్టాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లా అభివృద్ధికి కీలకమైన వరికపూడిశెల ప్రాజెక్టు పనులను సత్వరమే చేపట్టాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఆదివారం పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటకు వచ్చిన ఆయన స్థానిక పల్నాడు విజ్ఞాన కేంద్రంలో విలేకర్లతో మాట్లాడారు. వరికపూడిశెలను అన్ని రాజకీయ పార్టీలు తమ స్వార్థ రాజకీయాలకు వాడుకుంటున్నాయని, ఇద్దరు ముఖ్యమంత్రులు శంకుస్థాపన చేసినా పనులు ముందుకు సాగలేదని విమర్శించారు. ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కూడా మరోసారి శంకుస్థాపన చేసేందుకు సిద్ధమవుతున్నారని, అలా కాకుండా పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య మాట్లాడుతూ పంటల ఇన్పుట్ సబ్సిడీ పరిమితంగా వచ్చిందని, పల్నాడు జిల్లాలో ప్రత్తి మిర్చికి ఇన్పుట్ సబ్సిడీ కింద రూ 2, 3 వేలు వచ్చాయన్నారు. ధరణ స్థిరీకరణ నిధి రూ .3 వేల కోట్లు ఇన్పుట్ సబ్సిడీ కింద రూ.2వేల కోట్లు మొత్తం రూ.5 వేల కోట్లలో రూ.1176 కోట్లు విడుదల చేశారని రబీ సాగు నాటికి కేటాయించిన మిగిలిన నిధులను కూడా విడుదల చేసి రైతులకు ఆర్థిక తోడ్పడు అందించాలని కోరారు. ఒక ఎకరా సాగు చేయాలంటే మిర్చి విత్తనాలకు రూ.25-40 వేల వరకు రైతులు బహిరంగ మార్కెట్లో కొనుగోలు చేయాల్సి వస్తుందని, రైతు భరోసా కేంద్రాల సరసమైన ధరలకు అన్ని రకాల విత్తనాలు పంపిణీ చేస్తామని చెప్పిన ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఈపూరులో పట్టుబడిన నకిలీ విత్తనాల మూలాలను కనుక్కొని సంబంధిత శాఖ అధికారులు నకిలీ విత్తన తయారీదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రూ.లక్ష వ్యవసాయ రుణాలు తీసుకున్న వారికి సున్నా వడ్డీ అదనంగా తీసుకున్న మరో రూ.లక్షకు పావలా వడ్డీ వర్తింప చేయాలన్నారు. గోదావరి పెన్నా నది అనుసంధానం అంటూ నకరికల్లు వద్ద చేపట్టిన ప్రాజెక్టును పనులు

2లో

తగ్గుతున్న సాగర్.. నిలకడగా ప్రకాశం..

2వ పేజీ

ఆశాజనకంగా ఖరీఫ్ సాగు

- ఆర్బీకేల్లో సిద్ధంగా ఎరువులు పురుగుమందులు
- నకిలీ విత్తనాలు అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు
- ప్రజాశక్తితో వ్యవసాయశాఖ జిల్లా అధికారి వెంకటేశ్వర్లు

8లో

దుకాణంలో తనిఖీలు చేస్తున్న అధికారులు

కారెంపూడిలో నకిలీ విత్తనాలు

ప్రజాశక్తి-కారెంపూడి

కారెంపూడిలో నకిలీ విత్తనాల కలకలం రేగింది. ఈపూరు మండలంలోని వీరభద్ర నర్సరీలో ఆర్యమ్ర్ కంపెనీకి చెందిన నకిలీ విత్తనాలు ఉన్నాయని రైతుల ఫిర్యాదు మేరకు జిల్లా వ్యవసాయ అధికారి మురళి తనిఖీలు చేపట్టి నకిలీ విత్తన ప్యాకెట్లు గుర్తించి ఖాళీ పాకెట్‌లను స్వాధీనం చేసుకున్నారు. నకిలీ విత్తన ప్యాకెట్లను మండల కేంద్రమైన కారెంపూడిలోని కర్షక్

2లో

లారీల కింద తొక్కిస్తామంటున్నారు..

ఈమని గ్రామస్తుల ఆగ్రహం - వాహనాలను అడ్డుకుని నిరసన

ప్రజాశక్తి-దుగ్గిరాల

ఎన్నికల సమయంలో వచ్చి దండాలు పెడతారు గెలిచిన తర్వాత ఏదీ పట్టించుకోవటం లేదని మండలంలోని ఈమని గ్రామస్తులు మండిపడ్డారు. కృష్ణా నది నుండి ఇసుక లోడుతో వస్తున్న ఏడెనిమిది లారీలను ఆదివారం సాయంత్రం గ్రామంలో అడ్డుకున్నారు. లారీల వల్ల రోడ్లు అధ్వానంగా తయారవుతున్నారని, ద్విచక్ర వాహనాలు పడిపోతున్నారని, పాఠశాలలకు వెళ్లే పిల్లలు జారి పడుతున్నారని ఆవేదన వెలిబుచ్చారు. లారీలను రానివొవ్వదని అడిగితే ఎమ్మెల్యే లారీలు అంటున్నారని, గట్టిగా మాట్లాడితే టైర్ల కింద తొక్కిస్తామంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరసనలో భాగంగా రహదారిపై గుంతల్లోని నీటిలో మహిళలు వరి నాట్లు వేశారు.

కుటిల రాజకీయాల వల్లే మణిపూర్ అల్లర్లు

ప్రజాశక్తి-తాడేపల్లి

కాషాయి పార్టీ కుటిల రాజకీయాలతో మణిపూర్‌లో అల్లర్లు చెలరేగుతున్నాయని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు విమర్శించారు. ఆదివారం తాడేపల్లి బోసుబొమ్మ సెంటర్‌లో మణిపూర్ ఘటనను నిరసిస్తూ నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం బోసుబొమ్మ సెంటర్‌లో పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు అధ్యక్షతన సభలో రామారావు మాట్లాడుతూ మతోన్మాదం జడలు విప్పితే ఎలాగ ఉంటుందో మణిపూర్ ఘటనలు తేటతెల్లం చేస్తున్నాయని చెప్పారు. రెండు తెగల మధ్య మొదలైన వివాదాన్ని సామరస్యంగా పరిష్కరించకుండా ఒక వర్గాన్ని వెంటేసుకుని మరో వర్గంపై దాడులకు తెగబడటం డబుల్ ఇంజన్ ప్రభుత్వం నిర్వాహకమని ఎద్దేవా చేశారు. ప్రధానమంత్రి మోడీకి

2లో

పోలీసులు అదుపులోకి తీసుకున్న జనసేన నాయకులు

జనసేన నాయకుల ముందస్తు అరెస్టులు

ప్రజాశక్తి - తెనాలి

తుళ్లూరు మండలం వెంకటపాలెంలో సోమవారం ముఖ్యమంత్రి జగన్ సభ జరగనున్న నేపథ్యంలో జనసేన నాయకుల ముందస్తు అరెస్టులు కొనసాగుతున్నాయి. సీఎం సభను అడ్డుకునేందుకు జనసేన నాయకులు తరలి వెళతారన్న ముందస్తు సమాచారంతో వారిని పోలీసులు కట్టడి చేస్తున్నారు. తెనాలిలో పెద్ద ఎత్తున పోలీసులు మోహరించారు. బోస్ రోడ్‌లోని హోటల్‌లో ఉన్న జిల్లా పార్టీ అధ్యక్షుడు గాదె వెంకటేశ్వర్లు, స్థానిక నాయకులు హరిదాసు గౌరీ శంకర్ తదితరులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా పోలీసులకు నాయకులకు మధ్య తీవ్ర వాగ్వివాదం చోటుచేసుకుంది.

6న చుండూరు మృతవీరుల సంస్మరణ సభ

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక అంబేద్కర్ భవన్‌లో ఆగస్టు 6న నిర్వహిస్తున్న చుండూరు మృతవీరుల సంస్మరణ సభను జయప్రదం చేయాలని బీమ్ భారత్ రాష్ట్ర అధ్యక్షులు పి.ప్రకాష్ కోరారు. ఆదివారం గుంటూరు నగరంలోని 47, 48 డివిజన్లలోని డగ్లస్ స్కూల్ వద్ద డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్, బాబుజగజ్జీవన్ రామ్ విగ్రహాల వద్ద ఈనెల 17 నుండి ఆగస్టు 6 వరకు గ్రామ గ్రామాన నిర్వహిస్తున్న దళిత, గిరిజన చైతన్య సమావేశాల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రకాష్ మాట్లాడుతూ దళిత, గిరిజనులపై జరుగుతున్న హత్యలు, అత్యాచారాలకు మనిషి వేతకు గురవుతున్న దళిత బహుజన కులాలు సంఘటిత శక్తులుగా ఎదగాల్సిన అవసరం ఉందన్నారు. దళిత, గిరిజనుల అభ్యున్నతికి నిర్దేశించిన 27 ప్రభుత్వ పథకాలు రద్దు చేశారని, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను దారిమళ్లించారని అన్నారు. దళిత, గిరిజనుల ఆత్మగౌరవదినంగా నిర్వహిస్తున్న చుండూరు మృతవీరుల సభలో దళితులు, గిరిజనుల హక్కుల కోసం ఉమ్మడి జిల్లా, రాష్ట్ర దళిత, బహుజన సంఘాల ప్రతినిధులతో ఐక్య కార్యాచరణ ఏర్పాటు చేసుకోవటంపై చర్చించటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో భీమ్ భారత్ జిల్లా నాయకులు ఎ.సుజాతరావు, దళిత బహుజన పరివర్తన సంఘం రాష్ట్ర అధ్యక్షులు జె.శ్రీకాంత్, భీమ్‌సేన సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.నీలాంబరం పాల్గొన్నారు.

చంద్రబాబు విశ్రాంతి తీసుకుంటే మంచిది

బొంతు నాగిరెడ్డి, ఎన్ఆర్ఐ

ప్రజాశక్తి-తెనాలి

జనం స్పష్టమైన తీర్పునిచ్చినా ఇంకా పాకులాడటం అనవసరమని, చంద్రబాబు నాయుడు ప్రశాంతంగా రెస్ట్ తీసుకోవటం మినహా చేయగలిగింది లేదని వైసిపికి చెందిన ఎన్ఆర్ఐ బొంతు నాగిరెడ్డి అన్నారు. తాజా రాజకీయ పరిణామాలపై ఆయన మాట్లాడుతూ గతంలో మాదిరిగా ఏదో ఒక పత్రికకు నజరానాలు ఇవ్వటం, ఆ పత్రికలో ఊదర కొట్టించుకోవటం ఇప్పుడు చెల్లుబాటు కాదన్నారు. సోషల్ మీడియా ప్రభావం జనంపై బాగా పనిచేస్తోందని, నాణానికి రెండు వైపులా ప్రజలు పరిశీలిస్తున్నారన్నారు. దీర్ఘకాలం ముఖ్యమంత్రిగా పనిచేశానని, సుదీర్ఘ కాలం ప్రతిపక్ష నేతగా ఉన్నానని చెప్పుకున్నా ప్రజలు గత ఎన్నికల్లో కేవలం 23 అసెంబ్లీ స్థానాలకు, మూడు పార్లమెంట్ సీట్లకే పరిమితి చేసిన సంగతి గుర్తుంచుకోవాలని అన్నారు. ప్రజాసంక్షేమంతో ప్రజల మన్ననలందుకుంటున్న జగన్ ముందు చంద్రబాబు కుప్పిగంతులు సాగవని, రాజకీయాలకు విరామం ప్రకటించి విశ్రాంతి తీసుకుంటే మంచిదని హితవు పలికారు.

తగ్గుతున్న సాగర్.. నిలకడగా ప్రకాశం..

ప్రజాశక్తి-విజయపురిసౌత్, తాడేపల్లి



నాగార్జునసాగర్ జలాశయం నీటిమట్టం రోజురోజుకు తగ్గుతోంది. ఆదివారం సాయంత్రానికి 590 అడుగులకు గాను 516.70 అడుగుల వద్దకు చేరింది. ఇది 143.3273 టీఎంసీలకు సమానం. కుడి కాల్వకు 5088 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బిసికి 1350 క్యూసెక్కులు, మొత్తం నీటి విడుదల 6838 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. మరోవైపు తాడేపల్లి ప్రకాశం బ్యారేజీ వద్ద నీరు నిలకడగా ఉంది. నానుడు వర్షాలతో పాటు ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని నదులు పొంగి పొర్లడంతో ప్రకాశం బ్యారేజీ వద్దకు వరద నీరు వచ్చి చేరుతోంది. ప్రస్తుతం ప్రకాశం బ్యారేజీ వద్ద వరద నీటి వల్ల ఎటువంటి ఇబ్బంది లేదని ప్రకాశం బ్యారేజీ, ఇరిగేషన్ అధికారులు తెలిపారు. బ్యారేజీ ఏడు గేట్లను ఎత్తి 15 వేల క్యూసెక్కులను

సముద్రంలోకి వదులుతున్నారు. కృష్ణా పశ్చిమ, తూర్పు డెల్టా, బందరు, ఏలూరు కాలువలకు, గుంటూరు ఛానల్‌కు 7600 క్యూసెక్కులను విడుదల చేశారు.

నేడు రాజధానికి సిఎం జగన్

(మొదటి పేజీ తరువాయి)

కుటుంబాలు వచ్చాయో తద్వారా సంపద ఎంత పెరిగిందో చూపించేందుకు వైసిపి ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తోంది. వాస్తవంగా ఈనెల 8న శంకుస్థాపన చేయాల్సి ఉన్నా కేంద్రం ఇళ్ల నిర్మాణానికి నిధులు ఇచ్చేందుకు వెనుకంజ వేసినట్టు వార్తలు వచ్చాయి. దీంతో 8వ తేదీన శంకుస్థాపన వాయిదా పడింది. ఇళ్ల నిర్మాణంపై రైతులు కోర్టును ఆశ్రయించగా గత 15 రోజుల్లో ఎటువంటి స్టే ఉత్తర్వులు రాకపోవడంతో ఇళ్ల నిర్మాణంపై ప్రభుత్వం వేగం పెంచింది. ఈ మేరకు సిఎం జగన్ సోమవారం కృష్ణాయపాలెం, వెంకటపాలెంలో లబ్ధిదారులకు ఇళ్లనిర్మాణ అనుమతి పత్రాలు అందించనున్నారు.

తొలుత కృష్ణాయపాలెంలో ఇళ్ల నిరాణానికి శంకుస్థాపన చేసి అనంతరం ఇప్పటికే నిర్మించిన నమూనా గృహాలను పరిశీలిస్తారు. తరువాత తుళ్లూరు మండలం వెంకటపాలెంలో నిర్వహించే బహిరంగసభలో ఆయన పాల్గొంటారు. సిఎం ఏర్పాట్లను ఆదివారం రాష్ట్ర మంత్రులు ఆదిమూలపు సురేష్, విడుదల రజిని, జోగి రమేష్, బాపట్ల పార్లమెంట్ సభ్యులు నందిగం సురేష్, సీఆర్డీఏ కమిషనర్ వివేక్ యాదవ్, జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, ఎమ్మెల్సీ తలశిల రఘురాం, రాష్ట్ర గహనిర్మాణశాఖ మేనేజింగ్ డైరక్టర్ లక్ష్మీషా, తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ పరిశీలించారు. మంగళగిరి మండలంలోని కృష్ణాయపాలెం లే అవుట్ 3లో ఇళ్ల శంకుస్థాపన, ముఖ్యమంత్రి అవిష్కరించనున్న పైలాన్, లే అవుట్‌లో నిర్మించనున్న సామాజిక మౌలిక సౌకర్యాల భవనాల శంకుస్థాపన శిలఫలకం, మోడల్ హౌస్, ఇంటి నిర్మాణాలకు భూమి పూజ చేసే ప్లాట్, మొక్కలు నాటే కార్యక్రమానికి సంబంధించి ట్యాంక్ బండ్, హెలిప్యాడ్ వద్ద ఏర్పాటు పనులను వారు పరిశీలించి అధికారులతో చర్చించారు. సీఆర్డీఏ పరిధిలోని దాదాపు 35,000 వరకు ఇళ్లు షేర్ వాల్ టెక్నాలజీతోనే నిర్మిస్తామని మంత్రి సురేష్ చెప్పారు. ప్రతి ఇంటికి నీరు, విద్యుత్ సౌకర్యంతో పాటు, పూర్తి స్థాయిలో రహదారులు, డ్రెయినేజీ వ్యవస్థలను ఏర్పాటు చేసి గేటడ్ కమ్యూనిటీలుగా లే అవుట్ లను ఆరునెలలో తీర్చిదిద్దుతామన్నారు.

దుగ్గిరాలలో నిరసన

కుటిల రాజకీయాల వల్లే మణిపూర్‌లో అల్లర్లు

(మొదటి పేజీ తరువాయి)

రావణకాష్టంలా రగులుతున్న మణిపూర్ గురించి పట్టించుకునే తీరిక లేదన్నారు. మహిళలను వివస్త్రలను చేసి గ్రామాల్లో ఊరేగించి అత్యాచారం చేయడం చూస్తుంటే మనం ప్రజాస్వామ్యంలో ఉన్నామా ఆటవిక రాజ్యంలో ఉన్నామా అనే అనుమానం కలుగుతోందని ఆవేదన వెలిబుచ్చారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరిచి మణిపూర్‌లో శాంతిని నెలకొల్పాలని, మహిళలపై అత్యాచారానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఈమని అప్పారావు, నాయకులు పి.గిరిజ, బి.విజయలక్ష్మి, కె.మేరి, సుధ, బి.దుర్గారావు, ఎస్.ముత్యాలరావు, శౌరిబర్తులం పాల్గొన్నారు.

నిరసనలో పాల్గొన్న ఎసిఎఫ్ సభ్యులు

మణిపూర్ ఘటనపై ఎసిఎఫ్ నిరసన

ప్రజాశక్తి-గుంటూరు

మణిపూర్‌లో ఇద్దరు మహిళలను నగ్నంగా ఊరేగించిన ఘటన జాతి యావత్తును ద్రిగ్భాంతికి గురి చేసిందని కుల నిర్మూలన సంస్థ (ఎసిఎఫ్) సభ్యులు పేర్కొన్నారు. ఈ ఘటనకు కారకులైన నిందితుల్ని కఠినంగా శిక్షించాలని కోరుతూ ఆదివారం గుంటూరు లాడ్జి సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఎసిఎఫ్ నాయకులు మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో దూసుకుపోతుంటే మరోవైపు ఇలాంటి అమానుష ఘటనలు స్త్రీల ఔన్నత్యాన్ని దెబ్బతీస్తున్నాయన్నారు. యావత్ దేశం తలదించుకోవాల్సిన మణిపూర్ దురాగతాలకు దేశంలో తావు ఉండకూడదని, దీని కోసం ప్రతి ఒక్కరూ పోరాడాలని చెప్పారు. కార్యక్రమంలో ఎసిఎఫ్ ఉపాధ్యక్షులు పి.కిరణ్‌కుమార్, సుజాత, అఖిల, మహాలక్ష్మి, జహీరా, ప్రగతి, దర్శి రజని పాల్గొన్నారు.

కారెంపూడిలో నకిలీ విత్తనాలు

(మొదటి పేజీ తరువాయి)

సీడ్స్‌లో కొనుగోలు చేసినట్లు బిల్లులు గుర్తించినట్లు తెలిపారు. నర్సరీ యాజమానిని విచారించగా ముగ్గురు రైతులు కారెంపూడిలోని కర్షక సీడ్స్‌లో విత్తనాలు కొని అక్కడ వేసినట్లు తెలపడంతో కర్షక్స్ సీడ్స్ దుకాణంపై శనివారం రాత్రి తనిఖీలు చేశామన్నారు. దుకాణంలో నకిలీ విత్తనాలు ఏమీ లేవని, రూ.16.38 లక్షల విలువ చేసే కొన్ని కంపెనీ విత్తనాలల్లో తేడాలను గుర్తించి అమ్మకాలను నిలిపేతకు ఆదేశించినట్లు తెలిపారు. ఈపూరు మండలంలో నర్సరీ యజమాని పూర్తిస్థాయిలో విచారించి చర్యల కోసం స్థానిక వ్యవసాయ శాఖ అధికారులు ఆదేశించామని, పోలీస్ స్టేషన్లో సైతం ఫిర్యాదు చేశామని చెప్పారు. జిల్లాలో ఎరువులు దుకాణాలపై ఎప్పటికప్పుడు టాస్క్‌ఫోర్స్ టీం నిత్యం తనిఖీలు చేస్తోందని, గ్రామ, మండల స్థాయి రెవిన్యూ డివిజన్ పరిధిలో ఆయా శాఖల అధికారులతో కలసి విజిలెన్స్ టీంను ఏర్పాటు చేశామని అన్నారు. ఫిర్యాదులంటే జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసిన కాల్ సెంటర్ నంబర్ 8331056905కు సమాచారం ఇవ్వాలని సూచించారు. తనిఖీల్లో మండల వ్యవసాయాధికారి యలమందారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

వరికపూడిశెల పనులను చేపట్టాలి

(మొదటి పేజీ తరువాయి)

ప్రారంభించాలని డిమాండ్ చేశారు. సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్ మాట్లాడుతూ భూములుంటేనే రైతు కాదని సాగు చేస్తే నిజమైన రైతని అన్నారు. పంటల ఇన్పుట్ సబ్సిడీ చేసిన రైతులకు కాకుండా భూ యజమానులకు దక్కుతుందన్నారు. వాస్తవ సాగుదారుడికి అయిన ఖర్చుకు పంపిణీ చేసిన ఇన్పుట్ సబ్సిడీకి సంబంధం లేకుండా ఉందని విమర్శించారు. గతంలో రుణాలు తీసుకొని చెల్లించిన కౌలు రైతులకు కూడా బ్యాంకర్లు రుణాలు ఇచ్చేందుకు ముందుకు రావడం లేదని దీనికి భూ యజమాని సంతకమే ప్రధాన సమస్యగా మారిందని కౌలు రైతులకు కార్డుల మంజూరులో రుణం మంజూరులో భూ యజమానికి సంబంధం లేకుండా సరళతరం చేయాలని డిమాండ్ చేశారు. బ్యాంకర్ల సమావేశంలో ప్రతి రైతుకు రుణాలు ఇస్తామని ఉత్తుత్తి ప్రకటనలు చేస్తున్నారని విమర్శించారు. జిల్లాలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని, 28 మండలాలు ఉండగా 9 మండలాల్లోనే ఒక మోస్తరు వర్షపాతం నమోదైందని, ఈ పరిస్థితుల్లో రైతుల ప్రత్యామ్నాయ పంటలు వేసే దిశగా వ్యవసాయ శాఖ అధికారులు సూచనలు చేయాలని కోరారు. జిల్లాలో అసంఘటితరంగ కార్మికులు చాలీచాలని వేతనాలతో జీవనం సాగిస్తున్నారని, ఆయా సమస్యలపై నిరసనలు చేసినా అధికారులు సమస్యలు పరిష్కారం కొరకు చర్చలు జరపలేదన్నారు. ఉపాధి హామీ పనులు పెంచాలని సకాలంలో వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఏకపక్ష నిర్ణయాలతో పార్టీ పదవులు

ప్రజాశక్తి - తాడికొండ

ఏకపక్ష నిర్ణయాలతో పార్టీ పదవులు కేటాయిస్తున్నారని వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్‌పై ఆ పార్టీ నాయకులే ఆరోపణలు గుప్పించారు. ఈ మేరకు తాడికొండలో పలువురు నాయకులు ఆదివారం విలేకర్లతో మాట్లాడారు. మైనార్టీ శ్రేణులు పదవులు కేటాయించే విషయంలో సురేష్ కుమార్ ఏకపక్ష నిర్ణయాలు సరికాదన్నారు. మండలానికి చెందిన కీలక పదవులను తాడికొండలోని ముఖ్య నాయకులతో, సర్పంచ్‌తో చర్చింకుండా గుంటూరులో ఉండే ముగ్గురు కీలకమైన నాయకుల సలహాలు తీసుకొని ఇస్తున్నారని విమర్శించారు. కేవలం 70 మైనార్టీ ఓట్లున్న మండల పరిధిలోని లచ్చనగుడిపూడినుంచి మండల మైనార్టీ అధ్యక్షుడి పదవి ఇచ్చారని, 4 వేల మైనార్టీ ఓటింగ్ ఉన్న తాడికొండలోని నాయకులకు మాత్రం ఏ పదవులు లేవని అన్నారు. పదవులు అనుభవిస్తున్న వారికే మరలా పదవులు కేటాయిస్తున్నారని అన్నారు. ఈ నిర్ణయాలు మార్చుకోకపోతే ధర్నా చేస్తామని ప్రకటించారు. సమావేశంలో షేక్ కలీల్, షేక్ జాని, ఇతర నాయకులు పాల్గొన్నారు.

పవిత్రోత్సవాల నిర్వహణకు ముందుకు వచ్చిన దాతలు

ప్రజాశక్తి-తెనాలి

పెదకాకాని దుర్గా మల్లేశ్వరస్వామి వారి ఆలయంలో ప్రతి ఏటా నిర్వహించే పవిత్రోత్సవాలకు దాతలు ముందుకు వచ్చారు. ఉత్సవాల వ్యయ భారాన్ని భరించేందుకు తెనాలికి చెందిన నేలవెల్లి కోటేశ్వరి కుటుంబ సభ్యులకు అవకాశం కల్పించాల్సిందిగా ఆలయ సహాయక కమిషనర్ ఎన్.శ్రీనివాసరెడ్డి, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావులను లిఖిత పూర్వకంగా కోరారు. దీనిపై ధర్మకర్తల మండలి సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని, దేవాదాయ శాఖ కమిషనర్‌కు నివేదిక సమర్పిస్తామని సహాయక కమిషనర్ తెలిపారు.

జిజిహెచ్‌లో పక్కాగా ఈ-ఆసుపత్రి అమలు

సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో ఈ -ఆసుపత్రి అమలు సేవలు పక్కాగా అమలు చేస్తామని సూప రింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ తెలిపారు. అవుట్ పేషెంట్ విభాగంలోని ఔట్ సోర్సింగ్ సిబ్బంది నిర్వహించే రిజ్రేస్టేషన్ విభాగాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు. అనంతరం మీడియా తో డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఈ ఆసుపత్రి అమలు కోసం నలు గురు అధికారులను తాత్కాలికంగా నియమించామన్నారు. వీరి పర్యవేక్షణ కోసం పరిపాలన అధికారిని కూడా ఏర్పాటు చేసామన్నారు. ఉదయం ఏమినిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పూర్తిగా అన్నీ ఒ పి రిజిస్ట్రేషన్ లు ఆధార్ కార్డు ద్వారా అనుసంధానం చేయించడానికి నిర్ణయించామన్నారు. డి ఈ ఒ లకు తగు సూచనలు ఇవ్వాల్సిందిగా ఈ ఆసుపత్రి జిల్లా కో ఆర్డినేటర్ ప్రదీప్ కు ఆదేశించాం.రానున్న రోజుల్లో పూర్తి స్థాయిలో ఈ ఆసుపత్రి అమలు చేసే విధంగా ప్రణాళిక లను సిద్ధం చేస్తున్నాం. తానే స్వయంగా కంప్యూటర్ ఆపరేట్ చేసి ఈ నలుగురి డి ఈ ఒ లకు శిక్షణ ఇచ్చినట్లు ఆయన చెప్పారు.

ఈ-ఆసుపత్రి సేవలను పరిశీలిస్తున్న సూపరింటెండెంట్

నేడు నల్ల జెండాలతో రాజధాని రైతుల నిరసన

ప్రజాశక్తి - తుళ్లూరు: రాజధాని రైతులు నల్ల జెండాలతో నిర సన తెలపనున్నారు. కోర్టు తీర్పు వచ్చేవరకు వేచి చూడ కుండా ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి సోమవారం రాజధాని అమ రావతిలోని ఆర్ - జోన్ లో సెంటు స్థలాల్లో గహ నిర్మాణాలకు శంకుస్థాపన చేయడాన్ని నిరసిస్తూ నల్ల జెండాలు,బ్యాడ్జీలతో నిరసన తెలపాలని నిర్ణయించారు. కృష్ణాయపాలెంలో సెంటు స్థలాల్లో గహ నిర్మా ణాలకు శంకు స్థాపన, అనంతరం వెంకట పాలెంలో జరిగే సభలో సీఎం పాల్గొననున్నారు. ఇందుకు నిరస నగా రాజధానిలోని అన్ని రైతు దీక్షా శిబిరాలలో నల్ల జెండాలతో నిరసన తెలపాలని రాజ ధాని రైతు ఐక్య కార్యాచరణ సమితి (జెఎసి) పిలుపు నిచ్చింది. గత మే 26 న సిఎం జగన్ వెంకట పాలెంలో పేదలకు సెంటు స్థలంకు సంబంధించిన పట్టాలు పం పిణీ చేయడాన్ని నిరసిస్తూ నల్ల జెండాలతో నిరసన తెలిపారు. అదేమాదిరిగా సోమవారం కూడా నిరసన తెలపనున్నారు.

మున్సిపల్ ఉద్యోగి నరసింహారావు మృతి

ప్రజాశక్తి-తాడేపల్లి: మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని తాడేపల్లి జోన్‌లో శానిటేషన్ డిపార్టుమెంట్ విభాగంలో పర్మి నెంట్ ఉద్యోగిగా పని చేస్తున్న కేళి నరసింహారావు (55) ఆదివారం మృతిచెందారు. గత కొంత కాలంగా ఆయన అనారోగ్య సమస్యలతో బాధపడు తున్నారు. పరిస్థితి విషమించి ఇంటి వద్దనే తుదిశ్వాస విడిచారు. నరసింహా రావు మృతికి సిపిఎం సీనియర్ నాయకులు జొన్నా శివ శంకరరావు, రూరల్ పట్టణ కార్యదర్శులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, బూరుగ వెంకటేశ్వర్లు, గాదె సుబ్బారెడ్డి, వైసిపి నాయకులు దొంతిరెడ్డి వేమారెడ్డి, బి.రామ కృష్ణారెడ్డి, ఎం.అంజిరెడ్డి, యు.కల్యాణ్ కుమార్, టిడిపి నాయ కులు వల్లభనేని వెంకట్రావు, జంగాల సాంబశివరావు, మురళీ, సిపిఐ నాయకులు కంచర్ల కాశయ్య, ఎం డాంగే, ఎం.రామారావు, వివిధ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు సంతాపం తెలి పారు. నరసింహారావు అం త్యక్రియలు ఆదివారం మధ్యాహ్నం తాడేపల్లిలో నిర్వహించారు.

మణిపూర్ ఘటనలపై కవులు గొంతెత్తండి

'కవిమిత్రుల సంగమం-కవి సమ్మేళనం' కార్యక్రమంలో వక్తలు

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

కవులు, రచయితలు కాలం కంటే వేగంగా ప్రవహించినప్పుడే సమాజం చైతన్యవంతమవుందని సుప్రసిద్ధ కథా రచయిత వడలి రాధాకష్ణ అన్నారు. నవ్యాంధ్ర రచయితల సంఘం ,బాపు- రమణ - బాలు కళాపీఠం ఆధ్వర్యంలో గుంటూరు సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ హాలులో ఆదివారం 'కవిమిత్రుల సంగమం-కవి సమ్మేళనం' జరిగింది. వడలి రాధాకష్ణ మాట్లాడుతూ మణిపూర్ రాష్ట్రంలో సభ్యసమాజం తలదించుకునేలా జరిగిన హేయమైన చర్యల్ని సాహితీ వేత్తలంతా ఖండించాలన్నారు. అమానవీయమైన ఈ దుర్ఘటనలపై కవులు రచయితలు గొంతెత్తాలన్నారు. వివిధ సాహితీ ప్రక్రియల్లో తమ నిరసనని తెలియ జేయాలన్నారు. సభాధ్యక్షత వహించిన రంగిశెట్టి రమేష్ మాట్లాడుతూ సాహిత్యానికి రంగులు పుల మడం శుభసూచకం కాదన్నారు. ప్రత్యేక అతిథిగా వచ్చిన ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం రాష్ట్ర సభ్యుడు కత్తి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కవులు రచయితలకు ప్రభుత్వం నుండి త్వరలో శుభవార్త అందబోతుందన్నారు. డాక్టర్ రమణ యశస్వి మాట్లాడుతూ ప్రపంచ సాహిత్యంలో వస్తున్న కొత్త మార్పుల్ని మనం నిత్యం గమనిస్తూ మన రచనా వ్యాసంగాన్ని కొనసాగించాలన్నారు. రమణ యశస్వి రచించిన 'గణపవరం కథలు' కథల పుస్తకాన్ని రచయిత్రి దినవహి సత్యవతి సమీక్షించారు. సీనియర్ జర్నలిస్టు నిమ్మరాజు చలపతిరావు మాట్లాడారు. అనంతరం 'మణిపూర్' దుర్ఘటనపై జరిగిన కవి సమ్మేళనాన్ని బి. జనార్ధనరెడ్డి నిర్వహించారు. కవి సమ్మే ళనంలో లంకా మాధవి చదివిన కవిత బెస్ట్ పోయెమ్ గా ఎంపికై మొదటి బహుమతి పొందగా, చందు నాగేశ్వరరావు, డా. నల్లపనేని విజయలక్ష్మి చదివిన కవితలు రెండవ బహుమతిని పొందాయి. కార్యక్రమంలో ఇటీవల కుసుమ ధర్మన్న సాహిత్యసేవా పురస్కారం అందుకున్న కలిమిశ్రీని, లక్నోకు చెందిన వర్తీ వెల్నెస్ ఫౌండేషన్ అవార్డు పొందిన ఆళ్ళ నాగేశ్వర రావును సత్కరించారు. ఇటీవల మరణించిన సుప్రసిద్ధ రచయిత శ్రీరమణకు సంతాపం తెలిపారు. సభా నిర్వహణను బండికల్లు జమదగ్ని నిర్వహించారు.

మేధావులారా స్పందించండి

డాక్టర్ కారుమంచి రవికుమార్

ప్రజాశక్తి -తెనాలి

మణిపూర్‌లో జరుగుతున్న వ ా ర ణ ాహా వ ం ం ్పై మేధావులంతా స్పందించాలని ప్రముఖ సామాజిక వేత్త డాక్టర్ కారుమంచి రవికుమార్ అన్నారు. మణిపూర్ అల్లర్లపై ఆదివారం ఆయన మాట్లాడుతూ కేవలం క్రైస్తవులన్న ఒకే ఒక్క కారణంతో హింసిస్తుంటే, దేశంలో మిషనరీల పేరిట ఎంతో మంది క్రైస్తవులు, పెద్ద పెద్ద సంస్థలున్నాయని వారంతా మౌనం వీడా లన్నారు. మణిపూర్ ఘటనలకు నిరసనగా చర్చిల్లో నిర్వహించే ప్రార్ధనల్లో కొద్ది నిముషాలు కేటాయించి, నల్ల రిబ్బన్లతో నిరసన తెలపి, ఆ వీడియో, ఫోటోలను సామాజిక మాధ్యమాలకు పంపాలన్నారు. బాధితు లకు బాసటగా నిలవటం ప్రతి ఒక్కరూ అనివార్యంగా భావించాలని పిలుపునిచ్చారు.

తిరిగి ఇస్తామన్న డబ్బులేవి?

- టిడ్కో గృహాలకు రీ టెండరింగ్ సమయంలో సీఎం ఇచ్చిన మాట
- టోకెన్ అమౌంట్‌గా చెల్లించిన మొత్తంలో సగం వాపసు
- ఇచ్చిన మాట మరిచారంటున్న చిలకలూరిపేట లబ్ధిదారులు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

గత ప్రభుత్వ హయాంలో టిడ్కో గృహాలను నిర్మించిన విషయం తెలిసిందే. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ గృహాలకు రీ టెండరింగ్ నిర్వహించడం, లబ్ధిదారులు టోకెన్ అమౌంట్‌గా చెల్లించిన మొత్తంలో సగం డబ్బులు తిరిగి వారికి ఇస్తామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రకటించి నాలుగేళు దాటుతోంది. ఇప్పటి వరకూ ఆ మాట నెరవేరలేదు. ఆ డబ్బులు తిరిగి ఇస్తారో లేదో అనే అనుమానం లబ్ధిదారులు వ్యక్తం చేస్తున్నారు.

తెలుగుదేశ ప్రభుత్వ హయాంలో పట్టణంలో ఫేజ్-1 కింద 5412,, ఫేజ్-2 కింద 1008 గృహాలను నిర్మించారు. రెండు ఫేజుల్లోని గృహాలను పూర్తి స్థాయిలో లబ్ధిదారులకు ఇంకా అప్పజెప్పలేదు. వివిధ విస్తీర్ణాల్లో బహుళ అంతస్తుల భవనాలు నిర్మించారు. కేటగిరీల వారీగా చూస్తే వాటిల్లో మొదట ఫేజ్‌లో 430 చదరపు అడుగుల గృహాలు 896, 365 చదరపు అడుగుల గృహాలు 512, 300 చదరపు అడుగుల గృహాలు 3,104 ఉన్నాయి. మొత్తం 4,512 గృహాలు.

లబ్ధిదారులు ఒక్కొక్కరు తమ వాటా రొక్కాన్ని 365 చదరపు అడుగుల గృహాలకు (ఒక బెడ్ రూమ్) రూ.50 వేలు చొప్పున, 430 చదరపు అడుగులు (డబల్ బెడ్ రూమ్స్) కి లక్ష రూపాయలు చొప్పున, సాధారణ గదుల వారు రూ.500 చొప్పున చెల్లించారు. అయితే సాధారణ గదులకు విడిగా బెడ్‌రూమ్ అనేది ఏమీ ఉండదు కనుక వారికి ప్రభుత్వం తిరిగి డబ్బేమీ ఇవ్వదు.

ముఖ్య మంత్రి జగన్ అధికారంలోకి రాగానే సింగిల్ బెడ్ రూమ్ లబ్ధిదారులకు వారు చెల్లించిన రూ.50 వేలలో సగం రూ.25 వేలు, డబల్ బెడ్‌రూమ్ లబ్ధిదారులు చెల్లించిన లక్ష రూపాయల్లో సగం రూ. 50 వేలు తిరిగి చెల్లిస్తామని మాట ఇచ్చారు. ఆ మాట నేటికీ అమలు కాకపోవడంపై లబ్ధిదారులు విమర్శలు గుప్పిస్తున్నారు. పట్టణంలో 365 చ.ఆ.ల వి 512 కి 50 వేలల్లో సగం 25 వేలు చొప్పున షుమారుగ రూ.1.28 కోట్ల రూపాయ లు.,430చ.ఆ.వి 896 కి చెల్లించిన లక్షల్లో సగం అంటే 50 వే లు చొప్పున రూ.4.48 కోట్లు రూ పా యలు వెరసి

సింగిల్, డబులు బెడ్ రూమ్స్ లబ్ధిదారులకు తిరిగి ఇవ్వాల్సిన మొత్తం రూ. 5.76 కోట్లు. గత ప్రభుత్వ హయాం లో కాంట్రాక్టును తిరిగి రీ-టెండరింగ్ పద్ధతిలో నిర్వహించి మిగిలిన డబ్బులు వినియోగదారులకు చెల్లిస్తామన్న జగన్ ఒక్క చిలకలూరి పే ట మున్సిపాలిటీ తర పున లబ్దిదారులకు చెల్లించాల్సి మొత్తం 5.76 కోట్ల రూపాయలుగా ఉంది. ఇంకా ఫేజ్-1 మిగిలే ఉంది.ఈ డ బ్బులు ఎప్పుడు వస్తాయో ఫేజ్-2 డబ్బులు ఎప్పటికి ఇస్తారోనని అయోమయంలో లబ్దిదారులు ఉన్నారు.

ప్రకృతిలో ఉల్లాసంగా పిల్లలు

ప్రజాశక్తి-తాడేపల్లి

ఆదివారం ఉదయం వేళ సన్నగా వాన తుంపరలు పడుతున్నాయి. కారుమబ్బులు కమ్ముకున్నాయి. ఇంకేముంది చిన్నారులకు, పిల్లలకు కావాల్సింది కేరింతలతో ఉల్సాసంగా ఉత్సాహంగా కృష్ణానది ఒడ్డున గడిపారు. ఆవార ఆధ్వరంలో ప్రకృతి పర్యావరణ పరిరక్షణ సంస్థ ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. కృష్ణానది తీరాన ఇసుక తిన్నెల్లో సుశీకరణ పరుగుతో ఈ కార్యక్రమం ప్రారంభమైంది. నది ఒడ్డున ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. ఆటపాటలతో ఆ ప్రాంతమంతా హోరెత్తిపోయింది. జాతీయ గీతాలాపనతో సాగి నదిలో ప్రాణ రక్షణ ప్రదర్శన, ఈత శిక్షణ, జలక్రీడలతో సరాదాగా కార్యక్రమం ముగిసింది. ఈ సందర్భంగా ఎంబి విజ్ఞాన కేంద్రం కార్యదర్శి పి.మురళీకృష్ణ మాట్లాడుతూ శరీర దారుఢ్యానికి, మనో వికాసానికి, ప్రకృతి పరిరక్షణకు ఇటువంటి కార్యక్రమాలు దోహం చేస్తాయని చెప్పారు. కార్యక్రమ నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు షారోన్, లైఫ్ గార్డ్ పంకజ్‌కుమార్, వైష్ణవి, సౌజన్య, యశస్వి, అభినయ్, అరవింద ప్రిన్సిపల్ ఇంద్రాణి పాల్గొన్నారు.

పోస్టాఫీస్ మార్పు

ప్రజాశక్తి-తాడేపల్లి

ఇప్పటి వరకు తాడేపల్లి అంజికొట్టు సెంటర్‌లో ఉన్న తాడేపల్లి పోస్టాఫీస్ గేటు సెంటర్ సమీపంలోని పాత చైతన్య గోదావరి బ్యాంకు భవనంలోకి మార్చినట్లు తాడేపల్లి పోస్ట్ మాస్టర్ ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం నుంచి యథావిధిగా కొత్త భవనం నుంచి సేవలు అందిస్తున్నట్లు చెప్పారు.

తూర్పు నియోజకవర్గంలో టిడిపి గెలుపే లక్ష్యం

నగర అధ్యక్షులు డేగల ప్రభాకర్

ప్రజాశక్తి-గుంటూరుజిల్లా ప్రతినిధి

గుంటూరు తూర్పు నియోజకవర్గంలో టిడిపి గెలుపు లక్ష్యంగా కార్యకర్తలు కృషి చేయాలని పార్టీ నగర అధ్యక్షులు డేగల ప్రభాకర్ అన్నారు. తెలుగుదేశం పార్టీ మైనార్టీ నాయకులు సయ్యద్ షబ్బీర్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన మైనార్టీ నాయకుల సమావేశం లో ప్రభాకర్ హాజరయ్యారు.వైసిపి పాలనలో మైనార్టీలను అనేక రకాలుగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. రాష్టంలో మైనార్టీల పైన జరుగుతున్నా హత్య రాజకీయాల లోని సిఎం జగన్ ఎందుకు మౌనంగా ఉన్నారో సమా ధానం చెప్పాలని ప్రభాకర్ డిమాండ్ చేశారు.మైనారిటీల అభివద్ధి తెలుగుదేశం పార్టీ తోనే జరుగుతుందన్నారు.ం ానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ జెండాను గుంటూరు తూర్పు నియోజకవర్గం లో ఎగరవేసే దిశగా ప్రతి ఒక్కరు కలిసి కట్టుగా పని చేయాలన్నారు.పార్టీలో పని చేస్తున్న ప్రతి తెలుగుదేశం పార్టీ కార్యకర్తకు అండగా ఉంటానని డేగల ప్రభాకర్ హామీ ఇచ్చారు.నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో అందరం కలిసి గుంటూరు తూర్పు నియోజ కవర్గంలో తెలుగుదేశం పార్టీ జెండా ఎగరవేసే బాధ్యత ప్రతి ఒక్క కార్యకర్త పై ఉందని పేర్కొన్నారు. టిడిపినాయకులు గుంటూరు పార్లమెంట్ కార్యదర్శి తాడివాక సుబ్బారావు, మైనార్టీ నాయకులు షేక్ లడ్డు సుభాని,షేక్ సిరాజ్,షేక్ షరీఫ్,కొండెపు.శేఖర్ యాదవ్,నాగిరెడ్డి పాల్గొన్నారు.

చెత్త ఆటోలు కదిలేదెప్పుడో!

- డీజిల్‌కు డబ్బుల్లేక నిలిచిన వాహనాలు
- డ్రైవర్లకూ జీతాల్లేవు
- నెట్టుడు బండ్లలోనే చెత్తను తరలింపు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

డీజిల్‌కు డబ్బులు లేక చెత్తను సేకరించే ఆటోలు సుమారు 10 రోజుల నుంచి ఎక్కడివక్కడే నిలిచిపోయాయి. తమలో కొంద రికి 2 నెలలు, మరి కొందరికి 3 నెలలుగా జీతాలు కూడా చెత్త ఆటోల కాంట్రాక్టరు వాటిని ఆపి వేసి నట్లు ఆయా వాహనాల డ్రైవర్లు చెబుతున్నారు. దీంతో చెత్త సేకరణ మళ్ళీ మెదటికె వచ్చింది. మున్సిపల్ పని వారు నెట్టుడి బండ్లలోనే చెత్తను సేకరిస్తున్నారు.

పట్టణంలో కొత్తగా గణపవరం,మానుకొండువారి పాలెం, పసుమర్రు కాకుండా మొత్తం 33 వార్డులు ఉన్నాయి. ఈ వార్డు లోకి చెత్త ఆటోలు రాక పోవటంతో నెటుడి బండ్లతోనే చెత్తను సేకరిస్తున్నారు. ఈ విషయమై సిఐటియు మండల కార్యదర్శి పేరుబోయిన వెంకటేశ్వర్లు మాట్లాడుతూ చెత్త పేరుతో యూజర్ చార్జీలు వసూలు చేస్తూ కనీస సేవలు కూడా ఇవ్వడం లేదని అన్నారు. వెంటనే ఆగిన చెత్త ఆటోలను విధు ల్లోకి తీసుకురావాలని మున్సిపల్ అధికారులను డిమాండ్ చేశారు. 249 మంది కార్మికులతో పనులు చేయిస్తూ అదనంగా ఈ చెత్త ఆటోలను తెచ్చారని అవి ఎప్పుడు వస్తాయో,రావో తెలియడం లేదని అన్నారు. ప్రస్తుతం పనులు చేస్తున్న కార్మికులపై పని భారం పెరిగిందని, అదనపు పని చేయించుకోవడమే తప్ప ఏమీ ఇవ్వడం లేదని అన్నారు. వెంటనే ఆయా సమస్యలపై అధికారులు మాట్లాడి చెత్త ఆటోలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని, వాటి డ్రైవర్లకు జీతాలు వెంటనే ఇచ్చేలా చూడాలని కోరారు.

మున్సిపల్ కమిషనర్ సి.హెచ్ గోవిందరావు మాట్లాడుతూ పట్టణంలో మొత్తం 29 చెత్త ఆటోలు ఉండగా, వాటిలో 20ను ఉపయోగిస్తున్నట్లు చెప్పారు. ఒక్కో చెత్త ఆటోకు రోజుకి రూ.2,031 చొప్పున చెల్లిస్తున్నట్లు చెప్పారు. పల్నాడు, బాపట్ల, గుంటూరుకు కలిపి గుంటూరు కాంట్రాక్టర్ రెడ్డి ఎంటర్ ప్రైజెస్ నిర్వహిస్తున్నారని చెప్పారు.రెండు నెలలుగా ఆ సంస్థకు చెల్లించాల్సిన బకాయిలు చెల్లించలేదని చెప్పారు. చెత్త పన్ను ఇంటికి రూ.60, వ్యాపార సంస్థలకు నెలకు రూ.350 చొప్పున వసూలు చేస్తున్నామని, అవి ఇంకా వసూలు కాలేదని అన్నారు. ఏదో విధంగా ఆ డబ్బులు వసూలు చేసి ఆ సంస్థకు చెల్లిస్తామన్నారు. త్వరలోనే చెత్త ఆటోలు మళ్లీ తిరిగే ప్రయత్నం చేస్తామని చెప్పారు.

నెట్టుడిబండిలో చెత్తనుతరలిస్తున్న కార్మికులు

నకిలీ విత్తనాలు అరికట్టడంలో వ్యవసాయ, విజిలెన్స్ శాఖలు విఫలం

రైతు సంఘం విమర్శ

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

జిల్లాలో నకిలీ విత్తనాలు కట్టడి చేయాల్సిన వ్యవసాయ, విజిలెన్స్ శాఖాధికారులు నామమాత్రంగా పని చేస్తున్నారని ఎపి రైతు సంఘం పల్నాడు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు విమర్శించారు. స్థానిక కోటప్పకొండ రోడ్డులోని పల్నాడు విజ్ఞాన కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గోపాలరావు మాట్లాడుతూ ఈపూరు, కారంపూడి మండలాలలో వెలుగు చూసిన నకిలీ విత్తనాల మూలాలపై క్షేత్ర స్థాయిలో విచారణ జరపాలని, నకిలీ విత్తన తయారీదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లైసెన్స్ లేకుండా అనేక నర్సరీలలో గుర్తింపు లేని విత్తనాలతో మిరపనారు పెంచి అక్రమంగా రైతులకు అంటగడుతున్నారని, అదేవిధంగా వ్యవసాయ శాఖ ఆధీనంలో ఉన్న రైతు భరోసా కేంద్రాల ద్వారా అన్ని రకాల విత్తనాలు ఎరువులు, పురుగుమందులు పంపిణీ చేస్తామని చెబుతున్న ప్రభుత్వం ప్రచార ఆర్భాటానికే పరిమితమైందని విమర్శించారు. అనేక ప్రాంతాల్లో మిర్చి విత్తనాలు 10 గ్రాముల ప్యాకెట్ రూ.1000 నుండి రూ 2,000కు పెంచి నల్లబజారులో కొనుగోలు చేయాల్సి వస్తోందని అన్నారు. జిల్లాకు సరిపడా మిర్చి,వరి, కంది , పత్తి విత్తనాల పంపిణీలో వ్యవసాయ శాఖ నిర్లక్ష్యం వహిస్తోందని, దీంతో నకిలీ విత్తనాల విచ్చలవిడి విక్రయాలు పెరిగాయని విమర్శించారు. పల్నాడు జిల్లాలో లక్ష హెక్టార్లకు పైగా మిర్చి సాగు చేస్తున్నారని అందుకు సరిపడా విత్తనాలను సరఫరా చేయడంలో ప్రభుత్వం వైఫల్యం చెందిందన్నారు. వ్యవసాయం గిట్టుబాటు కాక అనేక ప్రాంతాల్లో సాగుకు రైతులు ముందుకు రాని పరిస్థితి ఉందన్నారు. విత్తనం నుండి పంట వరకు మొత్తం రైతు భరోసా కేంద్రం చూసుకుంటుందని చెప్పిన ప్రభుత్వం ఆచరణలో ముందుకు రాలేదన్నారు. వ్యవసాయానికి ప్రాథమిక అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను సకాలంలో సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై నిర్లక్ష్యం వహిస్తే రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులను ఏకం చేసి పోరాటం చేస్తామని హెచ్చరించారు.

మాట్లాడుతున్న ఏపూరి గోపాలరావు, పక్కన బాలకృష్ణ

బిఎల్‌ఒ డ్యూటీ కోసం అంగన్వాడీలపై ఒత్తిడి తగదు

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

బిఎల్ఓ డ్యూటీలు చేయాలని అంగన్వాడీ లను ఒత్తిడి చేయడంపై ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పెర్స్ యూనియన్ పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.మల్లీశ్వరి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పల్నాడు విజ్ఞాన కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ అంగన్వాడీలు అనేక రకాల యాప్ లలో రిజిస్టర్లలో వివరాలు నమోదు చేయడంతో పాటు పిల్లలకు,తల్లులకు పోషకాహారం వండి పెట్టాల్సిన బాధ్యతలు ఉన్న నేపథ్యంలో బిఎల్ఓ విధులకు హాజరవడం సాధ్యం కాదన్నారు. ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు స్కూల్లోనే ఉం డాల్సి వస్తుందని,ఈ నేపథ్యంలో బిఎల్ఓ డ్యూటీకి వెళ్లడం వారికి సాధ్యపడదన్నారు. గ్రామాలలో ముఠా తగాదాల నేపథ్యంలో రాజకీయ వేధింపులకు కూడా అంగన్వాడీలు గురవుతునానరన్నారు. గతంలో అం గన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అనేక పోరాటాలు చేసి బిఎల్ఓ డ్యూటీల నుండి వెసులు బాటు ఇవ్వాలని డిమాండ్ చేసిన నేపథ్యంలో 2019 లో విముక్తి లభించిందన్నారు. ప్రస్తుతం రాజుపాలెం, సత్తెనపల్లి మండలాల్లో ఉద్యోగుల కొరత అంటూ అంగన్వాడీలను ఆ విధులకు హాజరు కావాలని ఒత్తిడి చేయడం తగదన్నారు. ఒత్తిడి శృతి మించితే ఉద్యమం చేస్తామని హెచ్చరించారు.గార్డియన్ నియా మక నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, పెండింగ్ లేకుండా సకాలంలో వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

సమావేశంలో మాట్లాడుతున్న జి.మల్లీశ్వరి

ఎస్పీ కార్యాలయంలో నేటి 'స్పందన' రద్దు

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

గుంటూరు జిల్లాలో ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో జిల్లా ఎస్పీ కార్యాలయంలో నేడు నిర్వహించనున్న స్పందన కార్యక్రమం రద్దు ఎస్పీ కార్యాలయ వర్గాలు ఆదివారం ప్రకటనలో పేర్కొన్నాయి. ఆయా సమస్యలు పరిష్కారం కోసం వచ్చే కక్షిదారులు సహకరించాలని కోరారు.

యానిమేటర్ ఖాతాలో శ్రీనిధి నగదు!

ప్రజాశక్తి-కారెంపూడి

డ్వాక్రా మహిళల కోసం రాష్ట్ర ప్రభుత్వం శ్రీనిధి నిధులు కేటాయించింది. బ్యాంకుల ద్వారా డ్వాక్రా గ్రూప్ సం ఘాలు నిధులు కేటా యిస్తే యానిమేటర్ ఖాతాలో శ్రీనిధి నగదు జమ అయిన విషయం ఆదివారం వెలుగుచూసింది. మండ లంలో 1244 మంది డ్వాక్రా గ్రూప్ సభ్యులు ఉండగా 311 గ్రూపులకు శ్రీనిధి రూ.50 వేల నుండి రెండు లక్షల 50 వేల వరకు వెలుగు సిబ్బంది ఇస్తున్నారు. ప్రతినెలా డ్వాక్రా గ్రూపు సభ్యులు బ్యాంకు ఖాతాలో జమ చేయాల్సి ఉంది. కానీ కారెంపూడిలో యానిమేటర్ గా కొనసాగుతున్న ఉమా తన ఖాతా నెంబరు డ్వాక్రా గ్రూపులకు ఇచ్చి తన ఖాతాలో జమ చేయించు కుంటున్న వైనం వెలుగు చూపింది. ఈ విష యమై ఆమెను గ్రూపుల సభ్యులు నిలదీశారు. నేను అందుబాటులో లేనని ఎలా జరిగింది అనేది తర్వాత చెబుతానని గ్రూప్ సభ్యులకు సమాధానం ఇచ్చింది. వివిధ గ్రూపుల నుండి లక్షల రూపాయల నగదు యానిమేటర్ ఖాతాలో జమ కావడంతో వెలుగు సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. డ్వాక్రా సభ్యులు ఈ విషయాన్ని ఎపిఎం శివకుమార్ దృష్టికి తీసుకు వెళ్లారు. విచారించి న్యాయం చేస్తామని సభ్యులకు హామీ ఇచ్చారు.



యానిమేటర్ ఖాతాలో జమ అయిన నగదు జాబితా

నాణ్యతలేమితో రోడ్డుకు గుంతలు

ప్రజాశక్తి - పెదకూరపాడు

నాణ్యతలేమితో రోడ్లు అధ్వానంగా మారాయని పెదకూరపాడు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. ఆది వారం పెదకూరపాడు నుండి అత్తలూరు వెళ్లే ప్రధాన రహదారిని ఆయన పరిశీలించారు. నిర్మించిన తొమ్మిది నెలలకే రోడ్డు గుంతలు ఏర్పడటం, రోడ్డు నాణ్యతను తెలియజేస్తోందన్నారు. అవినీతి, అక్రమాలలో వైసిపి ప్రభుత్వం కూరుకుపోయిందన్నారు. ఈ రోడ్డును చూస్తే వారి పని తీరు తెలిసిపోతోందని విమర్శించారు.

వరల్డ్ వైడ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నాట్య అకాడమీ విద్యార్థులు

ప్రజాశక్తి - వినుకొండ

పట్టణానికి చెందిన సంగీత నాట్య అకాడమీ విద్యార్థులు వరల్డ్ వైడ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సాధించడం అభినందనీయమని కౌన్సిలర్ దస్తగిరి షకీలా అన్నారు. ఆదివారం అకాడమీ నిర్వాహకులు విద్యార్థులకు సర్టిఫికెట్స్ ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. నాట్య విభాగంలో వినుకొండ ఎదగడం శుభ సూచికమన్నారు. స్నేహ సంగీత నాట్య ఆకడమీ 10వ వసంతం సందర్భంగా గత ఏడాది మార్కాపురంలో భారత నాట్య ప్రదర్శన 400 మంది విద్యార్థులతో, 200 నిమిషాలు ఆగకుండా భరత నాట్యం ప్రదర్శన ఇచ్చినట్లు నిర్వాహకురాలు ప్రతిమ సునీల్ తెలిపారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించిన వరల్డ్ వైడ్ బుక్ ఆఫ్ రికార్డ్ ట్రస్టు అందులో వారికి చోటు కల్పిస్తూ సర్టిఫికెట్లను అందజేసినట్లు చెప్పారు. నాలుగు వందల మంది విద్యార్థుల్ల 45 మంది వినుకొండ విద్యార్థులు ఉండడంపై సంతోషం వ్యక్తం చేశారు.



ఆర్ఎంపి, పిఎంపిలకు అవగాహనా సదస్సు

ప్రజాశక్తి-నకరికల్లు

గ్రామాల్లో పనిచేసే ఆర్ఎంపి, పిఎంపి వైద్యులు ప్రజలకు సేవాగుణంతో పనిచేయాలని డాక్టర్ పేరం రాజనంద రెడ్డి తెలిపారు. సీజనల్ వ్యాధులపై లైఫ్ లైన్ వైద్య శాల ఆధ్వర్యంలో మండలంలోని ఆర్ఎంపి, పిఎంపి వైద్యులకు అవగాహన సదస్సును ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎండి జనరల్ రాజా నందారెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు లైఫ్ లైన్ వైద్యశాలలో తక్కువ ఖర్చుతో మెరుగైన వైద్య సదుపాయాలు అందిస్తున్నామన్నారు. అనంతరం నందారెడ్డిని సీనియర్ ఆర్ఎంపి వైద్యులు చింతపల్లి ఫకీర్ అహ్మద్, ఆచారి, రమణారెడ్డి, రత్నం, శాలువా కప్పి సన్మానించారు.

బిల్లు కంటే అదనంగా ఇతర ఛార్జీలు

- సిపిఎం నాయకుల ఎదుట వినియోగదారుల ఆవేదన
- విద్యుత్ బిల్లులపై సర్వే
- బిల్లులు తగ్గించకుంటే ఆందోళన చేస్తాం
- ఎక్కడివారికి అక్కడే ఇళ్ల పట్టాలివ్వాలి
- సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు డిమాండ్

ప్రజాశక్తి - మంగళగిరి

విద్యుత్ సంస్థల నష్టాల పేరుతో పేదలపై విద్యుత్ చార్జీల పెంచడం తగదని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు అన్నారు. విద్యుత్ చార్జీల పెంపుపై మంగళగిరి పట్టణంలోని రత్నాల చెరువులో ఆదివారం సిపిఎం ఆధ్వర్యంలో ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ 2014 నుండి 2019 వరకు టిడిపి ప్రభుత్వం హయాంలో విద్యుత్ కొనుగోలు, అమ్మకాలు వలన విద్యుత్ సంస్థకు రూ.2,900 కోట్ల నష్టం వచ్చిందనే పేరుతో ఇప్పుడు విద్యుత్ ఛార్జీలు పెంచారని విమర్శించారు. ట్రూ ఆఫ్ ఛార్జీలు, కస్టమర్ ఛార్జీలు, తదితర ఛార్జీల పేరుతో 36 నెలలు వసూలు చేయడం తగదన్నారు. ఇప్పటికే 12 నెలల పాటు వసూలు చేశారని చెప్పారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం విద్యుత్ సంస్కరణల పేరుతో వ్యవసాయ పంపు చెట్లకు మీటర్లు బిగించడం రైతులకు తీవ్ర నష్టమని, బిజెపి ప్రభుత్వ విధానాలను రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం తూచా తప్పకుండా అమలు చేస్తోందని విమర్శించారు. దీనిపై ఆందోళనను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఇదిలా ఉండగా అసలు కంటే అదనపు బిల్లులే ఎక్కువగా ఉన్నాయని, 18 యూనిట్లు, 20 యూనిట్లు కరెంట్ కాల్చిన వారికి కూడా రూ.300కు పైగా బిల్లులు వచ్చాయని పలువురు వాపోయారు. పూరిపాకలో ఉన్నప్పటికీ కరెంటు చార్జీలు ఎక్కువగా వస్తున్నాయని నాయకులకు తెలిపారు. రూ.100 కరెంటు కాలిస్తే ఇతర ఛార్జీల పేరుతో మరొక రూ.100 కలిపి బిల్లు వస్తోందని పలవురు ఆవేదనకు గురయ్యారు. 22 యూనిట్లు కాల్చుకుంటే రూ.205 బిల్లు వచ్చిందని జి.సుబ్బమ్మ, 18 యూనిట్లు కాల్చుకుంటే రూ.180 బిల్లు వచ్చిందని కె.సుబ్బారావు వాపోయారు.

విద్యుత్ బిల్లులను పరిశీలిస్తున్న పాశం రామారావు, ఇతర నాయకులు

పేదలు ఎక్కడ నివాసం ఉంటే అక్కడే ఇటి పట్టా ఇవ్వాలని రామారావు డిమాండ్ చేశారు. రాజధానిలో సెంటు స్థలం ఇచ్చామని చెప్పి ఇక్కడ ఉన్న ఇళ్లను తొలగిస్తే ఉద్యమిస్తామని హెచ్చరించారు. మంగళగిరి పట్టణంలో 4000 మంది ప్రభుత్వ భూముల్లోనూ, ప్రాంతంలోనూ 50 ఏళ్లుగా ఇళ్లేసుకుని నివాసం ఉంటున్నారని వారికి అక్కడే పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏ వసతులు లేని ప్రాంతంలో సెంటు స్థలమిస్తే పేదలు ఇక్కడ నుండి కదలరని అన్నారు. పిల్లలు చదువు ఎలా చదువుకుంటారని ప్రశ్నించారు. రత్నాల చెరువు నివాసముంటున్న వారు ఇల్లు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ఎస్ చెంగయ్య, సీనియర్ నాయకులు పి.బాల కృష్ణ, స్థానిక నాయకులు ఎం.చంద్ర, ఎం.చలపతిరావు, ఇ.కాటమరాజు, కె.వెంకటేశ్వరరావు, జె.భార్గవ, జి.దుర్గాప్రసాద్, బి.స్వామినాథ్, నాగరాజు, నాగేష్, కె.శ్రీనివాసరావు, పి.ఆదియ్య పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రం వద్ద బందోబస్తు విధుల్లో పోలీసులు

అంజుమన్ ఎన్నికల పోలింగ్ ప్రశాంతం

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో అంజుమన్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరుగుతున్నాయి. నగరంలోని సికె హై స్కూల్లో ఆదివారం ఉదయం 8 గంటల నుండి పోలింగ్ ప్రారంభమైంది. మంగళగిరి నగరంలో మొత్తం 2,838 మంది అంజుమన్ ఓటర్లుండగా సాయంత్రం ఐదు గంటల కల్లా 2,750 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు ఎన్నికల అధికారి అస్గర్ అలీ తెలిపారు. పోలింగ్ కేంద్రం వద్ద అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మంగళగిరి పట్టణ సిఐ బి.అంకమ్మరావు ఆధ్వర్యంలో ఎస్ఐ మహేంద్ర, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. మిద్దె సెంటర్ వద్ద నుండి ఎన్నికల పోలింగ్ కేంద్రంలోనికి ఓటు వేసే వ్యక్తిని మాత్రమే లోనికి అనుమతించారు. ఈ ఎన్నికల్లో ముస్లిమ్ యువతరం, ముస్లిమ్ ఫ్రంట్, ముస్లిమ్ యువసేన, ఇస్లామిక్ ఫ్రంట్‌లు పోటీ పడుతుండగా ఓట్ల లెక్కింపు మంగళవారం చేపట్టనున్నారు.

టీచర్లకు పిఎఫ్ లోన్లు మంజూరు చేయాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి-గుంటూరు

ఉపాధ్యాయులకు వారి పిఎఫ్ ఖాతాల నుంచి లోన్లు మంజూరు చేయాలని యుటిఎఫ్ గుంటూరు నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.చిన్నయ్య, కె.ప్రభూజీ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. జిఒ 84 ప్రకారం మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాలలో పనిచేసే టీచర్ల సర్వీసు, పర్యవేక్షణ బాధ్యతలను మున్సిపల్ కార్పొరేషన్ కమిషన్ నుంచి ఎంఇఒ, ఉన్నత పాఠశాల హెచ్ఎంకు బదిలీ చేస్తారని, అప్పటి నుండి కార్పొరేషన్ టీచర్లకు ఎఫ్ లోన్లు నిలిపివేసినట్లు చెప్పారని పేర్కొన్నారు. టీచర్లు వారి పిల్లల ఫీజులు, కుటుంబ వైద్య ఖర్చులు, వివాహాలు, ఇతరత్రా అవసరాల కోసం దాచుకున్న పిఎఫ్ ఖాతాల నుంచి లోన్లు అందక ఆందోళన చెందుతున్నారని, మున్సిపల్ కమిషనర్ స్పందించి పిఎఫ్ లోన్లు మంజూరు చేయాలని కోరారు. ఎంఇఒ పరిధిలో మున్సిపల్ టీచర్లకు కొత్త పిఎఫ్ ఖాతాలు తెరిచినట్లయితే ఇన్‌కం ట్యాక్స్ నుంచి కొంత ఉపశమనం పొందే అవకాశం ఉందని తెలిపారు.

ఆళ్ల నాగేశ్వరరావును సత్కరిస్తున్న కళాపీఠం బృందం

కవి, రచయిత ఆళ్ల నాగేశ్వరరావుకు సత్కారం

ప్రజాశక్తి-తెనాలి

పట్టణానికి చెందిన కవి, రచయిత ఆళ్ల నాగేశ్వరరావుకు లక్నోకు చెందిన వర్తి వెల్నెస్ ఫౌండేషన్ రాష్ట్రీయ ప్రతిష్టా పురస్కారాన్ని అందించిన సందర్భంగా ఆదివారం గుంటూరు బ్రాడిపేట ఎస్‌హెచ్ఒ కార్యాలయంలో సత్కరించారు. పట్టణానికి చెందిన బాపు, రమణ, బాలు కళాపీఠం, నవ్యాంధ్ర రచయితల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో కవిమిత్రుల సంగమం కార్యక్రమం నిర్వహించి, కార్యక్రమంలో భాగంగా నాగేశ్వరరావును సత్కరించారు. సాహితీ రంగంలో ఆయన చేస్తున్న కృషిని ప్రశంసించారు. కార్యక్రమంలో సాహితీ వేత్త డాక్టర్ రమణ యశస్వి, నవ్యాంధ్ర రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కలిమిశ్రీ, వివిధ సంఘాల ప్రతినిధులు కె.వెంకటేశ్వర్లు, వి.రాధాకృష్ణ, కె.సుబ్రహ్మణ్యం, వి.భీమేశ్వరప్రసాద్, ఆర్.రమేష్, పివి సుబ్బారావు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్ క్రీడాకారిణికి రోటరీ క్లబ్ చేయూత

ప్రజాశక్తి-తెనాలి

పవర్ లిఫ్టింగ్ క్రీడాకారిణికి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆర్థిక చేయూతనిచ్చారు. స్థానిక ఎంఎం జ్యూయలర్స్ కార్యాలయం వద్ద ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో పట్టణానికి చెందిన పవర్ లిఫ్టింగ్ క్రీడాకారిణి, నేషనల్ గోల్డ్ మెడలిస్ట్ షేక్ సబీనాకు రూ.50 వేలను అందించారు. త్వరలో రుమేనియాలో జరుగనున్న ప్రపంచ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనేందుకు షేక్ సబీనా వెళ్లనున్న నేపథ్యంలో ఆర్థికంగా సహకరించినట్లు క్లబ్ బృందం చెప్పారు. ఎనిమిది మంది విద్యార్థినులకు బాలికా సాధికారిత కింద సైకిళ్లను అందించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు పి.రాంబాబు, అసిస్టెంట్ గవర్నర్ కె.మురళి, డాక్టర్ కె.అర్చనరెడ్డి, బన్నాలి మనిదేవి, క్లబ్ సభ్యులు రమేష్‌కుమార్ జైన్. నరేష్‌కుమార్ జైన్, డాక్టర్ రవీంద్ర, ఇ.వెంకటపూర్ణచంద్, చేతన్‌రాజ్ కొఠారి, వి.శ్రీధర్, బి.బుజ్జి, కె.ప్రవీణ్, కృష్ణచైతన్య, కె.శ్రీనివాసరావు, జగదీశ్వ రమ్మ, కె.యశ్వంత్‌కుమార్, కె.గిరీష్, జాన్ కీట్స్, జస్వంత్ కుమార్, గౌతం కుమార్, దిల్‌కుష్, మన్‌కుష్ పాల్గొన్నారు.

క్రీడాకారిణికి చెక్కును అందిస్తున్న రోటరీ క్లబ్ బృందం

మాట్లాడుతున్న అధికారులు

ఆడిట్ శాఖ భవిష్యత్తు - అభివృద్ధిపై చర్చ

ప్రజాశక్తి - మంగళగిరి

రాష్ట్ర ఆడిట్ శాఖ ఉద్యోగుల సమావేశం స్థానిక ఓ హోటల్లో ఆదివారం నిర్వహించారు. రాష్ట్ర ఆడిట్ శాఖ యొక్క భవిష్యత్ అభివృద్ధి ప్రణాళికపై జరిగిన సమావేశంలో జూనియర్, సీనియర్ ఆడిటర్లు, సహాయ అధికారులు, జిల్లా అధికారులు, అందరూ ఐక్య కార్యాచరణ సమితిగా ఏర్పడ్డారు. రాష్ట్ర ఆడిట్ శాఖ డైరెక్టర్ ఆర్.హరి ప్రకాష్ గతేడాది ఫిబ్రవరిలో బాధ్యతలు చేపట్టి నాటి నుండి తెచ్చిన మార్పులు, పనుల్లో అభివృద్ధిని పలువురు కొనియాడారు. శాఖా పరంగా చేపట్టిన మార్పులు, సిబ్బందికి సమకూర్చిన సదుపాయాలపై పలువురు మాట్లాడారు. మున్సిపాలిటీల్లో విజయవంతంగా ప్రీ ఆడిట్ విధానం తేవడం, యూనివర్సిటీలో ప్రీ ఆడిట్ కోసం ప్రత్యేక సాఫ్ట్వేర్ రూపకల్పన, అభివృద్ధి, కొత్త జిల్లాల్లో వాహన సదుపాయాలు తేవడాన్ని ప్రస్తావించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆడిట్ శాఖ ప్రెసిడెంట్ సిహెచ్ శ్రీధర్, వర్కింగ్ ప్రెసిడెంట్ టి.సుధాకర్‌రెడ్డి, (ఏపీఎస్ఏఎస్జీవోస్) ప్రధాన కార్యదర్శి సిహెచ్ కృష్ణారావు, కృష్ణమోహన్, అధికారులు సూర్యభాస్కర్, వి.శ్రీనివాస్, మధుబాబు పాల్గొన్నారు.

26న విద్యుత్ ఉద్యోగుల చలో విజయవాడ

జయప్రదం కోసం పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-తెనాలి

విద్యుత్ శాఖలో కాంట్రాక్ట్, రెగ్యులర్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 26న విజయవాడలో నిర్వహించతలపెట్టిన ఏపి విద్యుత్ ట్రేడ్ యూనియన్స్ స్ట్రగుల్ కమిటీ రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా నాయకులు కె.బాబుప్రసాద్ పిలుపునిచ్చారు. ఈ మేరకు వాల్‌పోస్టర్లను ఆదివారం ఉద్యోగులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాబుప్రసాద్ మాట్లాడుతూ విద్యుత్ శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, రెగ్యులర్ ఉద్యోగులకు చెందిన కార్మిక సంఘాలు సిఐటియు, ఎఐటియుసి, ఐఎన్‌టియుసి, టిఎన్‌టియుసి కలిసి కార్మికుల హుక్కుల సాధన కోసం పోరాట కమిటీగా ఏర్పడినట్లు చెప్పారు. భవిష్యత్ కార్యాచరణపై చర్చించేందుకు విజయవాడలోని ఎంబివికె ఆడిటోరియంలో ఈనెల 26న రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పర్మినెంట్ ఉద్యోగులకు 45 శాతం ఫిట్‌మెంట్‌తో పే రివిజన్ చేయాలని, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికుల సర్వీసులను క్రమబద్ధీకరించాలని, జెఎల్ఎం గ్రేడ్-2, ఎనర్జీ అసిస్టెంట్లకు ప్రొబేషన్, కారుణ్య నియామకాలు అమలు చేయాలనే ప్రధాన డిమాండ్లతో నిర్వహించే సదస్సును జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో జి.నాగరాజు, ఆర్.శేఖర్, ఎస్.నాగరాజు పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

టిజెపిఎస్ కాలేజీలో నేడు మెగా జాబ్‌మేళా

ప్రజాశక్తి - గుంటూరు

స్థానిక టిజెపిఎస్ కాలేజీ ప్లేసెమెంట్ సెల్, మ్యాజిక్ బస్ సంయుక్తాధ్వర్యంలో సోమవారం మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎబిపి మనోహర్, కళాశాల సెక్రటరీ - కరెస్పాండెంట్ కెవి బ్రహ్మం తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన జారీ చేశారు. సోమవారం ఉదయం 10 గంటలకు కళాశాల ఆడిటోరియంలో తొమ్మిది కంపెనీల ప్రతినిధులు వస్తారని, విద్యార్థులల్లో నైపుణ్యాలను పరిగణలోకి తీసుకుని ఉద్యోగాలు ఇస్తారని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినయోగం చేసుకోవాలని కోరారు.

గ్రామీణ, పట్టణ కళాకారులు ఉద్యమించండి

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

సంప్రదాయ సాంస్కృతిక రంగాన్ని నిర్వీర్యం చేస్తూ విదేశీ విషమ సంస్కృతిని ప్రవేశ పెడుతున్నాని, దేశంలోని శాస్త్ర బద్ధమైన కళలను అంతరించేలా చేస్తున్న పాలకవర్గ విధానం చేస్తోందని ఇప్టా జాతీయ కార్యదర్శి గని విమ ర్శించారు. నరసరావుపేటలోని సిపిఐ కార్యాలయంలో ఆంధ్ర ప్రదేశ్ ప్రజానాట్యమండలి పల్నాడు జిల్లా సమితి సబ ఆదివారం ఏర్పాటు చేశారు. ఈ సభకు ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి పల్నాడు జిల్లా అధ్యక్షులు మద్దుకూరి రవీంద్రబాబు అధ్యక్షత వహించారు. గని మాట్లాడుతూ ప్రభుత్వానికి కనువిప్పు కలిగించేందుకు గ్రామీణ, పట్టణ ప్రాంతాల కళాకారులు ఉద్యమించాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రజలు ఎదుర్కొనే సమస్యలను ఇతివృత్తాలుగా మలిచి పాటల రూపంలో కళారూపాల ద్వారా ప్రజా నాట్యమండలి కళాకారులు ప్రజలను చైతన్య పరచాలని అన్నారు. పల్నాడు జిల్లా సిపిఐ కార్యదర్శి ఏ మారుతి వరప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలపై జరిగే ప్రజా పోరాటంలో ప్రజా నాట్యమండలి పాత్ర కీలకమన్నారు. మణిపూర్ ఘటన సభ్య సమాజం సిగ్గు పడాలన్నారు. సమావేశంలో ప్రజానాట్య మండలి జిల్లా ప్రధాన కార్యదర్శి భైరాపట్నం రామకృష్ణ, జిల్లా నాయకులు కాసా రాంబాబు, వైదన వెంకట్, వి.చెన్నకేశవరావు, మునగొటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వాలంటీరే.. వైసిపి బూత్ లెవెల్ ఏజెంట్!

ప్రజాశక్తి-చిలకలూరిపేట

బీఎల్వో, వైసిపి బూత్ లెవెల్ ఏజెంట్తో కలిసి ఓటర్ల వివరాలు సేకరిస్తున్న చిత్రం

చిలకలూరిపేటలో వాలంటీరే వైసిపి బూత్ లెవెల్ ఏజెంట్గా ఉండి బీఎల్ వోతో కలిసి ఓటర్ల తనిఖీ చేపట్ట డంపై తీవ్ర విమర్శలు వచ్చాయి. స్థానిక 172వ పోలింగ్ కేంద్రంలో వాలంటీరు, వైసిపి నాయకుడు నఫీస్ ఎన్నికల సంఘం జారీ చేసిన నిబంధనలను ఉల్లంఘించి ఓటర్ల తనిఖీల్లో పాల్గొన్నారని ఆ వార్డు తెలుగుదేశం పార్టీ నాయ కులు అన్నారు. స్థానిక 14వ వార్డులోని 172వ పోలింగ్ కేంద్రం పరిధిలో బీఎల్వో, వైసిపి బూత్ లెవెల్ ఏజెంట్తో కలిసి ఓటర్ల వివరాలు తనిఖీ చేస్తున్నారని చెప్పారు. అంతేకాకుండా వాలంటీర్, బిఎల్ఓ మొబైల్ తీసుకొని యాప్లో ఓటర్ల వివరాలు నమోదు చేయడంపై టిడిపి పట్టణ నాయకులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో వాలంటీర్లను భాగస్వాముల్ని చేయెుద్దంటూ ఎన్నికల సంఘ మార్గదర్శకాలు జారీ చేసినప్పటికి, బీఎల్వో నిబంధనలు ఉల్లంఘించి వాలంటీర్ను వెంట పెట్టుకుని ఇంటింటికీ వెళ్లి ఓటర్ల తనిఖీ చేస్తున్నారన్నారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవ డం లేదని టిడిపి నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓటర్ల తనిఖీల సందర్భంగా ప్రతిపక్ష పార్టీల ప్రతినిధులకు కనీసం సమాచారం కూడా ఇవ్వలేదని అన్నారు. వాలంటీర్లను రానీయకుండా చూడాల్సిన బూత్ స్థాయి అధికారులే తమతో పాటు వారిని పరిశీ లనకు తీసుకెళ్లడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. వాలంటీర్లు, బిఎల్ఒలతో కలిసి ఇంటింటి తనిఖీల్లో పాల్గొంటుంటే ఓటర్ల జాబితా ప్రక్షాళ న సాధ్యపడుతుందా అని ప్రశ్నిస్తు న్నారు. బిఎల్ఒను తక్షణమే విధుల నుంచి తప్పించి మరొకరిని నియ మిం చాలని టిడిపి నాయకులు డిమాండ్ చేశారు.

మణిపూర్‌లో అల్లర్లకు బిజెపిదే బాధ్యత

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

మణిపూర్ లో జరుగుతున్న అల్లర్లకు బీజేపీ బాధ్యత వహించాలని ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యురాలు గద్దె ఉమశ్రీ డిమాండ్ చేశారు. సత్తెనపల్లి మండలం రెంటపాళ్ళ లో ఐద్వా, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మణిపూర్ అల్లర్లకు నిర సనగా శనివారం రాత్రి కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఉమశ్రీ మాట్లాడుతూ మణిపూర్ రాష్ట్రంలో మహిళలను అర్ధనగ్నంగా ఊరేగించి అత్యాచారం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మణిపూర్ లో జరుగుతున్న దాడులకు రాష్ట్ర బిజెపి ప్రభు త్వం కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని అన్నారు. మణిపూర్లో ప్రశాంత వాతావరణాన్ని కల్పిం చాలని కోరారు. దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర హోమ్ శాఖ మంత్రి అమిత్ షా కలగజేసుకొని శాంతిని నెలకొల్పేందుకు కృషి చేయాలని, సత్వరమే చర్య తీసు కోవాలని డిమాండ్ చేశారు. ప్రజాసంఘాల ఆధ్వ ర్యంలో దుండగులు కఠినంగా శిక్షించాలని నిరసన కార్య క్రమం చేప ట్టారు. కార్యక్రమంలో ఐద్వా నాయకురాలు దుగ్గి మేరమ్మ , ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

మోడీ రాజీనామా చేయాలి

ప్రజాశక్తి-చిలకలూరిపేట

మతాల మధ్య చిచ్చుపెట్టి రిజర్వేషన్ పేరుతో మణిపూర్ను మారణపూర్గా మార్చిన ప్రధాని మోడీ, నైతిక బాధ్యత వహించి తక్షణమే తన పదవికి రాజీనామా చేయా లని రాష్ట్ర కాంగ్రెస్ అధికార ప్రతినిధి చిలకలూరిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్ఛార్జి ఎం.రాధాకృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ

అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పిస్తున్న క్రిస్టియన్ కౌన్సిల్ సభ్యులు

మణిపూర్ లో శాంతి భద్రతల వైఫల్యానికి పూర్తి బాధ్యత వహించాల్సిన ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్షా, ప్రధాని మోదీలేనని అన్నారు. ఇప్పటికైనా మణిపూర్లో రాష్ట్రపతి పాలన విధించాలని సైనిక బలగాల సహాయంతో అరాచ క వాదులను ఉక్కు పాదంతో అణచి వేయాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై త్వరలో చిలకలూరిపేట పట్టణంలో రాజకీయ అఖిలపక్ష జెఎసి ఆధ్వ ర్యంలో పెద్ద ఎత్తున శాంతి ర్యాలీ నిర్వహించనున్నట్లు చెప్పారు.

నేరస్తులను వెంటనే కఠినంగా శిక్షించండి

ప్రజాశక్తి - వినుకొండ

దేశవ్యాప్తంగా సంచలనం రేపించినటువంటి మణిపూర్ ఘటనను నిరసిస్తూ ఆదివారం అఖిల భారత శాంతి సంఘీ భావ సంఘం (ఎఐపిఎస్ఒ) ఆధ్వర్యంలో పట్టణంలోని బస్టాండ్ దగ్గర అంబేద్కర్ విగ్రహం నుండి శివయ్య స్తూపం సెంటర్ వరకు విద్యార్థినీ విద్యార్థులతో ర్యాలీ నిర్వహిం చారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎఐపిఎస్ఒ రాష్ట్ర కన్వీనర్ మహంకాళి సుబ్బారావు మాట్లాడుతూ సంస్కృతీసాంప్రదా యాలకు నిలయంగా ఉన్న మణిపూర్ మత విద్వేషాలతో

వినుకొండలో ఎఐపిఎస్ఒ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరసన ర్యాలీ

గిరిజన ప్రాంతాలను ఖాళీ చేయించాలన్న ఉద్దేశపూరిత బిజెపి భావజాలంతో ఆ రాష్ట్రాన్ని తగలబెడుతోందని విమర్శించారు. మదమెక్కి ఆడబిడ్డలపై మానభంగం చేసింది ఎవరో కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలో ఉన్న బిజెపి వాళ్లకు తెలియదా అని ప్రశ్నించారు. గత కొంత కాలంగా మతపరమైన కొన్ని దుష్ట శక్తులు ఒక సామాజిక తరగతి ప్రజల్లో మరొక సామాజిక తరగతి ప్రజలకు వ్యతిరేకంగా విషబీజాలు నాటి, నేటి దుస్థితికి కారణమయ్యారని విమర్శించారు.

ఎఐపిఎస్ఒ నాయుకులు రెడ్డి బోయిన సాగర్ బాబు మాట్లాడుతూ మెయిటీ, కుకీల మధ్య పెరుగుతున్న అగాధాన్ని పూడ్చడానికి సకాలంలో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోకపోవడానికి కారణం రాజకీయ సంకల్పం లోపించడమేనని విమర్శించారు. ఎఐపిఎస్ఒ నాయకులు పామర్తి సురేష్ కుమార్ మాట్లాడుతూ ఈ దుష్పరిణామం యావత్ దేశంపై ప్రభావాన్ని కలిగిస్తుందని అన్నారు. మణిపూర్లో జరిగిన పైశాచిక అత్యాచార దాడులను తీవ్రంగా ఖండించాలని, ఉన్మాద రాజకీయాలను, వాటి సైద్ధాంతిక భావజాలాన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

నిరసన యాత్ర

మణిపూర్లోని చర్చిలపై, దళిత గిరిజనులపై జరుగుతున్న విధ్వంస కాండకు నిరసనగా అసోసియేషన్ ఆఫ్ ఇంటిగ్రేటెడ్ క్రిస్టియన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో దళిత సంఘాలతో కలసి వినుకొండలోని అంబేద్కర్ విగ్రహం వరకు నిరసన యాత్ర చేపట్టారు, అనంతరం క్రైస్తవ మహిళలు దీవెనమ్మ, అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. దళిత ,గిరిజన, మైనార్టీలు, మహిళలపై జరుగుతున్న దాడులను ఖండించారు. నిరసనలో పల్నాడు జిల్లా పాస్టర్స్ అధ్యక్షులు హైడ్ రాజు, జిల్లా పొలిటికల్ వింగ్ అధ్యక్షులు ప్రసన్న కుమార్, ఉపాధ్యక్షులు. పిడుగు విజయ్, నియోజకవర్గ అధ్య క్షులు ఎన్.ప్రేమానిధి, సెక్రటరీ గాంధీ, వినుకొండ మండల అధ్యక్షులు దేవప్రసాద్, నూజండ్ల మండల అధ్యక్షులు రాజేంద్ర ప్రసాద్, ఈపూరు మండల అధ్యక్షులు రవికుమార్, సెక్రటరీ, రామస్వామి,బొల్లాపల్లి మండల అధ్యక్షులు, ఉపా ధ్యక్షులు , సెక్రటరీలు ప్రభాకర్, చిన్న దాసు, గాలెయ్య , శావల్యాపురం మండల అధ్యక్షులు రామయ్య పాల్గొన్నారు.

రెంటపాళ్ళ లో కొవ్వొత్తులతో ప్రదర్శన

'ఆంధ్రా ఎంపీలు మాట్లాడకపోవడం సిగ్గుచేటు'

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

మణిపూర్లో మారణహోమానికి పాల్పడుతున్న వారిపై చర్యలు చేపట్టడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని దళిత , బహుజనుల హక్కుల పోరాట సమితి అధ్యక్షులు డాక్టర్ గోదా రమేష్ కుమార్ విమర్శించారు. రొంపిచర్ల మండలం లోని నల్లగార్లపాడు అంబేద్కర్ నగర్ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆయా ఘటనలకు కారకులను శిక్షించడంలో కేంద్ర ప్రభుత్వం, మణిపూర్ ప్రభుత్వం పూర్తిగా విఫలమయ్యాయని విమర్శించారు. ఈ ఘటనపై పార్లమెంట్ సమావేశాల్లో అన్ని రాష్ట్రాల ఎంపీలు మణిపూర్ ఘటనలపై కేంద్ర ప్రభుత్వాన్ని ఏకదాటిగా ప్రశ్నిస్తుంటే ఆంధ్రప్రదేశ్కు చెందిన ఎంపిలు మాట్లాడకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. ఈ విషయమై కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే కేసులలో ఇరికి స్తారేమోనని ఆంధ్రా ఎంపీలు భయపడుతున్నారని అన్నారు. బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత దళిత బహు జనులపై దాడులు ఎక్కువయ్యాయని, ప్రధాని మోడీ ఎన్నికలపై పెట్టిన శ్రద్ధ పాలనపై పెట్టడం లేదని అన్నారు. ఒక రాష్ట్రంలో శాంతి భద్రతలను అదుపులోకి తీసుకురాలేని బిజెపి ప్రభుత్వం దేశాన్ని పాలించే అర్హతను కోల్పోయిందని విమర్శించారు.

ఉర్దూ పాఠశాలల పర్యవేక్షణ

అధికారికమో? అనధికారికమో? తేల్చండి

ఆర్జేడీని కోరిన యుటిఎఫ్ పల్నాడు జిల్లా కమిటీ

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

జిల్లా విభజన అనంతరం పల్నాడు జిల్లాకు ఉర్దూ డి.ఐ పోస్ట్ ఎవరికి కేటాయించకపోయినా గత కొంతకాలంగా జిల్లా లోని పలు ప్రాంతాల్లోని చిలకలూరిపేట, నరసరావుపేట తది తర ఉర్దూ ప్రాథమిక పాఠశాలను ఉర్దూ డిఐ హోదాలో బాపట్లకు చెందిన నజ్మా ఖాతూన్ పర్యవేక్షణ పేరుతో తనిఖీలు చేస్తున్నారని, ఈ తనిఖీలు అధికారికంగానా లేక అనధికారికం గా చేస్తున్నారో తెలియక ఉపాధ్యాయులు గందరగోళంలో ఉన్నారని యుటిఎఫ్ పల్నాడు జిల్లా కార్యదర్శి పి. ప్రేమ్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి జి. విజయ సారధి అన్నారు. ఈ మేరకు ఆర్ జె డి కి అందుబాటులో లేకపోవడం వలన వాట్సఅప్ ద్వారా తమ సం దేశాన్ని పంపించినట్లు పేర్కొన్నారు.

ఈ సందర్భంగా ప్రేమ్కుమార్ మాట్లాడుతూ అధికారిక ఉత్తర్వులు లేకుండా తనిఖీలు చేయడానికి అవకాశం లేదన్నారు. తనిఖీల పేరిట తరగతుల సమయంలో పాఠశాలలకు వచ్చి విద్యా ర్థులు బోధనకు ఆటంకం కలిగిస్తున్నారని సన్మాన,సత్కారాలు చేయించుకుంటున్నారని అన్నారు. జిల్లాల విభజన అనంతరం పల్నాడు జిల్లాకు డిఐగా ఎవరిని నియమించలేదని ఉన్నతాధి కారులు చెబుతున్నారన్నారు. పల్నాడు జిల్లాలోని ఉర్దూ పాఠశాల పర్యవేక్షణకు సంబంధించి నెలకొన్న సందిగ్ధత తొలగించి అర్హులైన వారికి బాధ్యతను కేటాయించాలని సూచించారు. కాగా, బాపట్ల జిల్లాకు ఉర్దూ డిఐగా విధులు నిర్వహిస్తున్న నజ్మా ఖాతూన్ తమ కార్యాలయానికి ఫర్నిచర్ కొనుగోలు చేయాలని కరెంటు బిల్లులు కట్టాలని, తమకు ఎటువంటి ప్రభుత్వ నిధులు కేటాయింపులు లేవని బాపట్ల జిల్లాలోని పలువురు ఉపాధ్యాయుల వద్ద నగదు తీసుకున్నారని పలువురు ఉపాధ్యాయులు ఆరోపిస్తున్నారు.

నరసరావుపేట మండలంలోని ములకలూరు ఎంపిపిఎస్ ఉర్దూ పాఠశాల తనిఖీ పేరుతో ఉపాధ్యాయులతో సన్మానం పొందుతున్న నజ్మా ఖాతూన్ (ఫైల్ఫొటో)

అధికారం కోల్పోయిన మరుక్షణమే జగన్ జైలుకు

మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

వచ్చే ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతో ఉన్న సీఎం జగన్లో నిరాశానిస్పృలు ఆవ హించాయని, అందుకే నోటి కొచ్చినట్లు మాట్లాడుతున్నారని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లా రావు విమర్శించారు. స్థానిక పండరీపురంలోని తన నివాస గృహంలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజల్లో రోజురోజుకీ వైసిపి ప్రభుత్వంపై వ్యతిరేకత పెరుగుతోందని అన్నారు.

టిడిపి అధినేత చంద్రబాబు, లోకేశ్, బాలకృష్ణపై జగన్ చేసిన అనుచిత వ్యాఖ్యలు, విమర్శలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. నాలుగేళ్ల పాలనలో ఏం చేశారో చెప్పకుండా, ప్రజాధనంతో ఏర్పాటు చేసిన బహిరంగ సభ లో ప్రతిపక్ష నేతలపై వ్యక్తిగత విమర్శలు చేయడం సబబు కాదన్నారు. నోటికొచ్చినట్లు మాట్లాడు తున్న జగన్ సహా, ఆయన తాబేదార్లకు బుద్ధి చెబుతామన్నారు.

మణిపూర్‌లో హింసను ఆపాలి

ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శనలు - చర్యలకు డిమాండ్

ప్రజాశక్తి-గుంటూరు

మణిపూర్‌లో హింసాకాండను తక్షణమే నిలుపుదల చేయాలని సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక పాతగుంటూరులోని బిఆర్ స్టేడియం వద్ద ఆదివారం నిరసన చేపట్టారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజి మాట్లాడుతూ 80 రోజులుగా మణిపూర్‌లో జరుగుతున్న దారుణమైన సంఘటనలపై మోడీ మౌనంగా ఉండటం బాధాకరమన్నారు. తక్షణమే బాధితులకు అండగా ఉండి, దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మహిళలపై జరుగుతున్న దాడిలో డబల్ ఇంజిన్ సర్కార్ నాయకుల పాత్ర ఉందనే అనుమానం బలపడుతోందని అన్నారు. అమిత్‌షా పర్యటన తర్వాత హింసాకాండ మరింత పెరగటం బిజెపి కుట్రపూరిత విధానాలకు నిదర్శమని చెప్పారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు డి.లక్ష్మీనారాయణ, నాయకులు రమేష్‌బాబు, శ్రీనివాసరావు, రమాసుష్మ, అన్నమ్మ పాల్గొన్నారు.

వాచ్‌మెన్ల సంఘం ఆధ్వర్యంలో...

ది గుంటూరు నగర అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్స్ అండ్ మెయింటెనెన్స్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బ్రాడీపేటలోని సిఐటియు కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. నగర అధ్యక్షులు మండూరి వెంకట నరసయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ మూడు నెలలుగా మణిపూర్‌లో అల్లరు జరుగుతుంటే బయటి ప్రపంచానికి తెలియకుండా ఇంటర్నెట్‌ను బంద్ చేశారన్నారు. మణిపూర్‌లో ముష్కరులు రాజ్యమేలుతుంటే అక్కడి ప్రభుత్వం ఏం చేస్తోందని ప్రశ్నించారు. మహిళలను నగ్నంగా ఊరేగిస్తుంటే అటు ప్రభుత్వానికి కానీ ఇటు పోలీసులకు కానీ పట్టదా అని అన్నారు. కార్యక్రమంలో నగర ప్రధాన కార్యదర్శి పి.రాంబాబు, యూనియన్ నగర గౌరవ అధ్యక్షులు ఆది నికల్సన్, ఎ.సాంబశివరావు, కె.శ్రీనివాసరావు, ఎం.శ్రీనివాసరావు, వాచ్‌మెన్లు పాల్గొన్నారు.

గుంటూరులో సిఐటియు నాయకులు, కార్యకర్తల నిరసన

గుంటూరులో అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్ల నిరసన

మంగళగిరిలో నిరసనలు

ప్రజాశక్తి - మంగళగిరి

మణిపూర్‌లో బిజెపి మతోన్మాదుల చర్యలకు నిరసనగా ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం మంగళగిరి అంబేద్కర్ సెంటర్లో నిరసన వ్యక్తం చేశారు. మానవత్వాన్ని మరిచిపోయి మృగాల్లాగా మహిళలు ప్రాణాలు తీస్తున్నారని నాయకులు మండిపడ్డారు. కార్యక్రమంలో ఇ.గోపి, జె.చైతన్య, జి.మణి కంఠ పాల్గొన్నారు. నియోజకవర్గ పాస్టర్స్ అసోసియేషన్, ఐక్య వేదిక ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహం వద్ద నుండి బయలుదేరి గౌతమ బుద్ధా రోడ్ మీదుగా రాజీవ్ గృహకల్ప రోడ్డు తిరిగి అంబేద్కర్ గారి విగ్రహం దగ్గరకు చేరారు. ఆర్.వై.దాస్, పి.తిమోతి, కెకె రవికుమార్, కె.చిన్నభూషణం, ఎవిఎస్ మనీ, కె.కరుణానిధి, వి.జాన్‌లూయిస్, కె.రామారావు, ఎం.సుదీర్, పి.బోయజ్, బి.శివాజీ రాజు, బి.ప్రశాంత్, పీటర్‌పాల్, సంజయ్ రాజేష్, జెఎంజె సిస్టర్స్, ఎం.రమేష్, సురేష్, జయకుమార్, ఎం.జాన్‌పాల్, ఎన్.విజయ రాజు, జి.రవి కుమార్, మహేష్, జి.శ్యాం ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-దుగ్గిరాల

మణిపూర్‌లో రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడుతున్న అరాచక శక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఐద్వా జిల్లా అధ్యక్షులు పద్మ డిమాండ్ చేశారు. ప్రజాసంఘాల ఆధ్వర్యంలో దుగ్గిరాలలో ఆదివారం నిరసన ప్రదర్శన చేయగా పద్మ మాట్లాడుతూ మణిపూర్ అల్లర్లు బిజెపి ప్రభుత్వం చేతకానితనానికి నిదర్శనమన్నారు. ఈ ఘటనలకు నైతిక బాధ్యత వహిస్తూ ప్రభుత్వం రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఇంత జరుగుతున్నా ప్రధాని మోడీ ప్రేక్షక పాత్ర సరికాదన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎస్.గౌరీ, జె.బాలరాజు, వై.స్టాలిన్, వై.బ్రహ్మేశ్వరరావు, ఎన్.యోగేశ్వరరావు, జి.శ్రీనివాస్, ఎం.నాగమల్లేశ్వరరావు, బి.చిరంజీవి, సిహెచ్ పోతురాజు, శ్రీనివాసరావు, ఏసుపాదం, పోలేరమ్మ పాల్గొన్నారు.

ఎపి ఎస్‌ఆర్‌ఎంకు మరో అవార్డు

ప్రజాశక్తి-మంగళగిరి రూరల్

ఏపీ ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీకి మరో అరుదైన గుర్తింపు లభించింది. పాఠ్య ప్రణాళిక రూప కల్పన, అభివృద్ధిలో ప్రతిభ కనబరిచినందుకు గాను అత్యంత ఉన్నత విశ్వవిద్యాలయంగా అవార్డ్‌ను అందుకుంది. తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో మీడియా సంస్థ 'అబ్జర్వ్ నౌ' ఇటీవల హైదరాబాద్ కేంద్రంగా ఎడ్యుకేషన్ లీడర్స్ ద్వితీయ సమ్మేళనాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమంలో ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన పలు యూనివర్సిటీలకు వివిధ అంశాల్లో పురస్కారాలను అందించారు. ఇందులో భాగంగా ఏపీ ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీకి పాఠ్య ప్రణాళిక రూప కల్పన, అభివృద్ధి కేటగిరీలో అవార్డును ప్రకటించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గుజరాత్ ప్రభుత్వ కార్మిక శాఖ అడిషనల్ చీఫ్ సెక్రటరీ డాక్టర్ అంజూ శర్మ, అబ్జర్వ్ నౌ చీఫ్ ఎడిటర్ తానియ తికూ నుండి పురస్కారాన్ని వర్సిటీ కమ్యునికేషన్ డైరెక్టర్ పంకజ్ బలీరియా అందుకున్నారు. యూనివర్సిటీకి అరుదైన గుర్తింపు లభించడం పట్ల వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ మనోజ్ కుమార్ అరోరా హర్షం వ్యక్తం చేశారు. జాతీయ విద్యా విధానంలో పొందు పరిచిన మార్గదర్శకాలకు అనుగుణంగా పాఠ్య ప్రణాళిక రూపకల్పన చేసినట్లు చెప్పారు.

ఉపాధ్యాయుల పెండింగ్ జీతాలు విడుదల చేయాలి

ప్రజాశక్తి-గుంటూరు

రాష్ట్రవ్యాప్తంగా 60 వేల మంది ఉపాధ్యాయుల జీతాలు చెల్లించకుంటే ఆగస్టు మొదటి వారంలో ఖజానా కార్యాలయాల ముట్టడిస్తామని ఎస్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హెచ్.తిమ్మన్న, మాజీ అధ్యక్షులు సిహెచ్.జోసెఫ్ సుధీర్‌బాబు హెచ్చరించారు. గుంటూరులోని మల్లయ్య లింగం భవన్‌లో ఎస్‌టియు జిల్లా మొదటి కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షులు గేరా మోహనరావు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. తిమ్మన్న, జోసెఫ్ సుధీర్‌బాబు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఇటీవల బదిలీ, పదోన్నతి పొందిన దాదాపు 60 వేల మంది ఉపాధ్యాయులకు జూన్ జీతాలు పెండింగ్‌లో ఉన్నాయని, తక్షణం వాటిని జమ చేయాలని డిమాండ్ చేశారు. జీతాల చెల్లింపునకు సంబంధించి సవరించిన క్యాడర్ స్ట్రెంత్ తక్షణం జిల్లా ఖజానా కార్యాలయాలకు పంపించాలని, లేకుంటే ఆగస్టు మొదటి వారంలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల ఖజానా కార్యాలయాలను ముట్టడించి దిగ్బంధం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చందా నరసింహారావు, ఆర్థిక కార్యదర్శి వెంకటేశ్వరరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామచంద్రయ్య, సుభాని, అంబరీషుడు, కె.జోజప్ప పాల్గొన్నారు.

పుట్ట సుబ్బారావుకు నాజర్ పరామర్శ

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

మండలంలోని కట్టెంపూడికి చెందిన వైసిపి సీనియర్ నాయకులు, నాగేంద్ర స్వామి పుట్ట మాజీ చైర్మన్ సుబ్బారావు తండ్రి వెంకట అప్పారావు ఇటీవల అనారోగ్యంతో మరణించారు. ఈ నేపథ్యంలో సుబ్బారావును ముస్లిమ్ మైనార్టీ నాయకులు షేక్ నాజర్ ఆదివారం పరామర్శించారు. ఆయనవెంట మొల్ల కరీం, మొల్ల సందాని, షేక్ మౌలాలి ఉన్నారు.

100 మందిలో 10 మందికే నేతన్న నేస్తం : టిడిపి

ప్రజాశక్తి-మంగళగిరి

నేతన్న నేస్తం పేరుతో వైసిపి ప్రభుత్వం నేతన్నలను దగా చేస్తోందని టిడిపి చేనేత విభాగం నాయకులు విమర్శించారు. ఈ మేరకు స్థానిక టిడిపి కార్యాలయంలో ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త ఎన్.అబద్దయ్య, నాయకులు టి.జానకీదేవి, జి.ధనుంజయరావు, కె.అంకమ్మ రావు ఆదివారం విలేకర్లతో మాట్లాడారు. 100 మంది అర్హుల్లో 10 మందికే నేతన్ననేస్తం వర్తిస్తోందని, లబ్ధిదారుల ఖాతాల్లో ఇప్పటికీ నగదు జమ కాలేదని అన్నారు. రాష్ట్రంలో చేనేత, అనుబంధ వృత్తుల్లో 3.60 లక్షల మంది ఆధారపడగా 80 వేల మందికే పథకాన్ని వర్తింజేశారన్నారు. మంగళగిరి నియోజకవర్గంలో 2500కు పైగా మగ్గాలుంటే 280 మందికే నేతన్న నేస్తాన్ని ఇచ్చారన్నారు. అర్హులందరికీ పథకాన్ని వర్తింజేయకుంటే హ్యాండ్ లూమ్ అడిషనల్ డైరెక్టర్ కార్యాలయం వద్ద నిరసన చేపడతామని చెప్పారు. సబ్సిడీలు, స్వయం ఉపాధి రుణాలు, ప్రోత్సాహకాలు రద్దు చేసి మరోవైపు బటన్ నొక్కి జీవితాలు మార్చేస్తున్నా అనడం సిగ్గుచేటన్నారు. టిడిపి హయాంలో పలు పథకాలు, రాయితీలు, పింఛన్లు అమలు చేశామని, వాటన్నింటినీ జగన్ రద్దు చేశారని విమర్శించారు. వైసిపి నాలుగేళ్ల పాలనలో వంద మందికిపైగా చేనేత కార్మికులు అప్పుల బాధతో ఆత్మహత్యలు చేసుకున్నారని, జగన్‌మోహన్‌రెడ్డి ముఠా పదుల సంఖ్యలో చేనేత కార్మికుల్ని కిరాతకంగా చంపేస్తే ఏ రోజు కూడా నోరెత్తలేదని ఉదయ్యబట్టారు. సమావేశంలో నాయకులు పి.లక్ష్మణరావు, వూట్ల శ్రీమన్నారాయణ, బి.చిదానందశాస్త్రి, జె.వెంకట సుబ్బారావు, వి.పెద లక్ష్మయ్య, జె.బాలకృష్ణ పాల్గొన్నారు.

రాజనారాయణకు మేయర్ అభినందన

ప్రజాశక్తి-గుంటూరు : గుంటూరు వ్యవసాయ మార్కెట్ యార్డ్ నూతన పాలక మండలికి చైర్మన్‌గా ఎంపికైన నిమ్మకాయల రాజనారాయణ సంపత్ నగర్‌లోని మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడును ఆయన క్యాంపు కార్యాలయంలో ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా రాజనారాయణను మేయర్ సత్కరించారు. మార్కెట్ యార్డ్ ఆసియా ఖండంలోనే ఎంతో పెద్దదని, పేరు ప్రఖ్యాతలు గడించిందని మేయర్ గుర్తు చేశారు. మార్కెట్ యార్డ్ అభివృద్ధికి, రైతులు సంక్షేమానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో డైరెక్టర్ సల్మా ఖాజా మొహిద్దీన్, వైసిపి నాయకులు కె.శ్యామ్‌శేఖర్, కె.శంకరరావు, బాలయ్య పాల్గొన్నారు.

కేసులేమిటో చెప్పకుండానే ఎన్‌ఐఎ అక్రమ అరెస్టులు

ప్రజాశక్తి-తెనాలి

ఎన్‌ఐఎ అక్రమంగా అరెస్ట్ చేసిన కెఎన్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు దుడ్డు ప్రభాకర్, అమరుల బంధు మిత్రుల సంఘం నాయకులు కందుల శిరీషను తక్షణమే విడుదల చేయాలని కెఎన్‌పిఎస్ రాష్ట్ర కార్యదర్శి కెఎన్ కృష్ణ డిమాండ్ చేశారు. న్యాయవాది జి.శివనాగేశ్వరరావు కార్యాలయంలో ఎఐఎస్‌ఇఆర్‌పిఎస్, కెఎన్‌పిఎస్ నాయకులు ఆదివారం నిర్వహించిన సమావేశంలో కె.కృష్ణ మాట్లాడుతూ ప్రభాకర్, శిరీషలను ఏ కేసులో అరెస్ట్ చేస్తున్నారనే విషయం కనీసం కుటుంబ సభ్యులకు కూడా చెప్పకపోవటం దారుణమన్నారు. విజయవాడ సింగ్ నగర్, ప్రకాశంజిల్లా అలకూరపాడులో ఇళ్లలో ఉన్న వారిని నంబరు లేని వాహనాల్లో ఎన్‌ఐఎ బృందం తరలించిందన్నారు. కుల నిర్మూలన పోరాట సమితిలో 25 ఏళ్లుగా పీడిత ప్రజల సమస్యలపై పోరాడుతున్న వారిని అరెస్ట్ చేయటం దారుణమన్నారు. న్యాయవాది నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రభాకర్, శిరీష అరెస్టులు పూర్తిగా అక్రమమన్నారు. పైగా వారి వద్ద నక్సల్స్ సాహిత్యం లభించిందంటూ, నాగర్నార్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ప్రభాకర్, శిరీష పాల్గొన్నారంటూ కల్పిత కదలు చెబుతున్నారని విమర్శించారు. వారిని తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎఐఎస్‌సిఆర్‌పిఎస్ నేషనల్ సెక్రటరీ ఎ.శ్యామ్, రాష్ట్ర కార్యదర్శి డి.వెంకటేశ్వరరావు, కె.చిన్నమ్మాయి. పి.శ్రీదేవి, నాంచారమ్మ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కృష్ణ, శ్యామ్, నాగేశ్వరరావు తదితరులు

సదస్సుల్లో పాల్గొన్న వివిధ సంస్థల ప్రతినిధులు, విద్యార్థులు

వివిఐటిలో వై 20 యూత్ టాక్ సదస్సు

ప్రజాశక్తి-తెనాలి : వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజి కళాశాల నంబూరులో వై20 యూత్ టాక్ సదస్సు ఆదివారం నిర్వహించారు. జి 20 యూత్ విభాగం వై 20 ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో వై 20 విభాగాధినేత దేవాన్ష్ షా పాల్గొన్నారు. మైక్రోసాఫ్ట్ ప్రాజెక్టు మేనేజర్ విజయ్ నందిన, అమేజాన్ ఆపరేషన్స్ మేనేజర్ అపూర్వ మద్దెల, మోటోరోలా ప్రాజెక్టు మేనేజర్ కేశవ్ రామ్, ఫ్లగ్ సంస్థ డిజిటల్ మార్కెటింగ్ మేనేజర్ యశ్వంత్ సాయి పాల్గొన్న సదస్సులో దేవాన్ష్ షా మాట్లాడుతూ ఏపిలో తొలిసారిగి వివిఐటిలో ఇలాంటి కార్యక్రమం నిర్వహించటం ఎంతో గొప్ప విషయమన్నారు. భావి తరాలకు ఉద్యోగ అవకాశాలు ఏ విధంగా ఉండబోతున్నాయన్న విషయాన్ని, ఉపాధి అవకాశాలపై నూతన సాంకేతికత ప్రభావం, నైపుణ్యాల కొరత ఉన్న యువతను ఏ విధంగా ముందుకు నడపాలనే అంశంపై సదస్సులో చర్చించామన్నారు. వివిఐటి వైస్ చైర్మన్ వాసిరెడ్డి మహదేవ్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా విస్తృత ఉపాధి అవకాశాలు కలిగిన ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ వినియోగం, ఉపయోగాలను, పరిశ్రమలకు తగ్గట్టుగా యువతలో నైపుణ్యాభి వృద్ధిపై కీలకంగా చర్చించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సదస్సులో పాల్గొన్న విద్యార్థులు ప్రదర్శించిన పలు నమూనాలను పరిశీలించారు. విద్యార్థులను చైర్మన్ వాసిరెడ్డి విద్యా సాగర్, ప్రిన్సిపల్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి అభినందించారు.

విద్యారంగంలో వెనుకబడిన పల్నాడు

- వేధిస్తున్న టీచర్ల కొరత
- వెంటనే డీఎస్సీని నిర్వహించాలి
- ఎమ్మెల్సీ కెఎస్‌లక్ష్మణరావు
- యుటిఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులు, ఉపాధ్యాయుల అభినందన సభ

ప్రజాశక్తి - వినుకొండ

పల్నాడు జిల్లా విద్యారంగంలో వెనుకబడి ఉందని, రాష్ట్రవ్యాప్తంగా అక్షరాస్యత శాతం 70గా ఉంటే పల్నాడు జిల్లాలో కేవలం 54 శాతమే ఉందని ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు ఆవేదన వెలిబుచ్చారు. నియోజకవర్గంలో ట్రిపుల్ ఐటి సీట్లు సాధించిన విద్యార్థులకు, ప్రమోషన్లు పొందిన ఉపాధ్యాయులకు యుటిఎఫ్ ఆధ్వర్యంలో అభినందన సభ ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ పల్నాడు జిల్లాలోని పాఠశాలల్లో పిల్లలు పెద్ద ఎత్తున చేరుతున్నా ఉపాధ్యాయుల కొరత చాలా ఎక్కువగా ఉందన్నారు. ఈ సమస్యను అధిగమించి నాణ్యమైన విద్యనందించాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రంలో ట్రిపుల్ ఐటీలు నూజివీడు, ఇడుపులపాయ, ఒంగోలు, శ్రీకాకుళం నాలుగు చోట్ల ఉన్నాయని, వినుకొండ నియోజకవర్గంలో 26 మంది సీట్లు సాధించడం అభినందనీయమన్నారు. వీరికి ఆరేళ్లపాటు ఉచిత విద్య, అనంతరం క్యాంపస్ ఇంటర్వ్యూల ద్వారా ఉద్యోగాలు పొందే అవకాశం ఉందని చెప్పారు. విద్యార్థులకు కేవీఆర్ - జయలక్ష్మి ఎడ్యుకేషనల్ సొసైటీ ట్రస్ట్ ద్వారా ఒక్కొక్కరికి రూ.వెయ్యి చొప్పున ప్రోత్సాహకాలను అందించి అభినందించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్లు జి.నాగరాజు, ఎం.పోలయ్య, జిల్లా కార్యదర్శి ఎం.రవిబాబు, ఆర్.అజయ్ కుమార్, సీనియర్ నాయకులు ఎ.నాగేశ్వరరావు, జి.నాగేంద్రుడు, ఇ.వెంకటరెడ్డి, సాంబశివరావు, పి.రవిబాబు, హనుమంత సూరి, పిఎ జిలాని, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

2023 డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలి

రాష్ట్ర ప్రభుత్వం వెంటనే 2023 డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు డిమాండ్ చేశారు. ఆదివారం వినుకొండకు వచ్చిన ఆయన స్థానిక స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. సీఎం జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి రాకముందు పాదయాత్ర సందర్భంగా ప్రతి ఏటా డీఎస్సీ విడుదల చేసి నిరుద్యోగులను ఆదుకుంటానని ఇచ్చిన హామీ మరిచారని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 20 వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, డీఈడీ, బీఈడీ పూర్తి చేసిన నిరుద్యోగులు ఐదు లక్షల మంది డీఎస్సీ కోసం ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వం 2023 విడుదల చేసే డీఎస్సీ ఒక మెగాడీఎస్సీగా ఉండాలని అన్నారు. పల్నాడు జిల్లాలో మాచర్ల, వినుకొండ, గురజాల తదితర ప్రాంతాల్లో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉందని, వినుకొండ పట్టణంలోని ప్రభుత్వ హైస్కూల్లో 800 మంది విద్యార్థులు ఉండగా పదిమంది ఉపాధ్యాయులు మాత్రమే ఉన్నారని తెలిపారు. ఉపాధ్యాయుల కొరతతో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యను ప్రభుత్వం గ్రహించి వెంటనే డిప్యూటేషన్ మీద అయినా ఉపాధ్యాయులను నియమించాలని డిమాండ్ చేశారు. 3, 4 తరగతులను హైస్కూల్లో వినవం చేయటం వలన అనేక మంది పేద విద్యార్థులు డ్రాపౌట్ అయ్యారని ఆందోళన వెలిచ్చారు. తీవ్ర నష్టానికి కారణమవుతున్న జీవో 117ను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్లస్ టు పాఠశాలలు, జూనియర్ కళాశాలలో విద్యార్థులు మధ్యాహ్న భోజనం, పాఠ్యపుస్తకాలు లేక పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతమని, ప్రభుత్వం స్పందించి వెంటనే పుస్తకాలు ఇవ్వాలని, మధ్యాహ్న భోజనాన్ని కొనసాగించాలని లక్ష్మణరావు డిమాండ్ చేశారు.

ఆశాజనకంగా ఖరీఫ్ సాగు

- ఆర్బీకేల్లో సిద్ధంగా ఎరువులు పురుగుమందులు
- నకిలీ విత్తనాలు అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు
- ప్రజాశక్తితో వ్యవసాయశాఖ జిల్లా అధికారి వెంకటేశ్వర్లు

ఖరీఫ్‌లో రైతులకు అవసరమైన ఎరువులు, పురుగు మందులు అందుబాటులో ఉన్నాయని వ్యవసాయశాఖ జిల్లా అధికారి ఎన్.వెంకటేశ్వర్లు చెప్పారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా ఇప్పటికే విత్తనాలు సరఫరా చేశామని, ఎరువులు, పురుగు మందులు కూడా సరఫరా చేస్తామని అన్నారు. ప్రస్తుతం కృష్ణాడెల్టాలో వర్షాలు ఆశాజనకంగా ఉన్నాయని, కాల్వలకు నీరు వస్తోందని చెప్పారు. ప్రస్తుతం సీజన్ ఆశాజనకంగా ఉందన్న ఆయన ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పలు అంశాలు వివరించారు.

ఖరీఫ్ సాగు ఎలాఉంది?

జిల్లాలో 1.65 లక్షల ఎకరాల్లో వరిసాగు చేస్తారని అంచనా ఉండగా దాదాపు 20 వేల ఎకరాల్లో వెద పద్ధతిలో సాగు చేశారు. డెల్టాలో ఇంకా నాట్లు ప్రారంభం కాలేదు. పత్తి సాగు 77 వేల ఎకరాలకు గాను 20 వేల ఎకరాల్లో విత్తనాలు నాటారు. ఇతర పంటలు మరో రెండు వేల ఎకరాల్లో సాగు చేశారు. వర్షాలు పుంజుకోవడంతో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. 3.25 లక్షల విస్తీర్ణంలో పంటలు సాగు చేయాల్సి ఉండగా వచ్చేనెల మొదటి వారం కల్లా 90 శాతం విస్తీర్ణంతో సాగవుతుంది.

రైతులకు అందిస్తున్న ప్రోత్సాహం

తొలి దశలో తొలకరి పంటలుగా గ్రీన్ మెన్యూర్ విత్తనాలు (పచ్చిరొట్ట) విత్తనాలు అందించాం. జనుము, జీలుగ, పిల్లిపెసర విత్తనాలు ఇప్పటికే ఆర్‌బికేల్లో అందుబాటులో ఉంచాం. వరి విత్తనాలు కిలో రూ.5కే సబ్సిడీపై ఇస్తున్నాం. మినుము, పెసర విత్తనాలు కూడా సబ్సిడీపై అందిస్తున్నాం. పత్తి విత్తనాలు 14 వేల ప్యాకెట్లు, మిర్చి విత్తనాలు ఆరువేల ప్యాకెట్లు ఆర్‌బికేల్లో అందుబాటులో ఉంచాం. వీటిని రైతులు 50 శాతం సబ్సిడీతో తీసుకోవచ్చు.

వెదపద్ధతిలో సాగు వల్ల ప్రయోజనాలు?

వరి వెద పద్ధతి వల్ల ఏడు రోజుల ముందుగానే పంట ఎదుగుదల దశ ప్రారంభం అవుతుంది. నారుమడి దశ ఉండదు. 135 రోజుల్లోనే పంట కోతకు వస్తుంది.నాటుపద్ధతి అయితే 145 రోజుల వరకు వేచి ఉండాలి. నాట్లు పద్ధతికి అయ్యే ఖర్చు మిగులుతుంది. నీటి అవసరం కూడా తగ్గుతుంది.

కల్తీ విత్తనాలు, నకిలీ పురుగు మందుల నియంత్రణ?

కల్తీ విత్తనాలు, నకిలీపురుగు మందులను అమ్మినా, సరఫరా చేసినా కఠిన చర్యలు తీసుకుంటాం. ఇప్పటివరకు 600 విత్తనాల నమూనాలను తీశాం. ఆరు శ్యాంపిల్స్ ఫెయిల్ అయినట్టు నివేదిక వచ్చింది. సంబంధిత కంపెనీల వారిపై ప్రాసిక్యూషన్‌కు కేసు దాఖలు చేశాం. దుకాణాలపై నిఘా ఉంచాం. రవాణా కార్యాలయాలు, పార్శిల్ సర్వీసులపై కూడా ప్రత్యేక దృష్టిపెట్టాం. ఇటీవల గుజరాత్ నుంచి పత్తివిత్తనాలు తీసుకువస్తుండగా బస్టాండ్‌లో పట్టుకున్నాం. పాతగుంటూరు పోలీసులకు ఫిర్యాదు చేశాం.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు?

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు (సిసిఆర్‌సి) పెద్దసంఖ్యలో ఇస్తున్నాం. గతేడాది ఇచ్చిన రైతులు అదే పొలంలో కొనసాగితే వాటిని భూ యజమానులతో మాట్లాడి రెన్యూవల్ చేస్తాం. భూమి మార్చుకుంటే కొత్త దరఖాస్తు తీసుకుని సిసిఆర్‌సిలు ఇస్తాం. ఇటీవల సురక్ష ద్వారా పెద్ద సంఖ్యలో సిసిఆర్‌సిలు జారీ చేశారు. ఇప్పటి వరకు 24 వేల మందికి జారీచేశాం. తొలుత 34 వేలు లక్ష్యంగా పెట్టుకోగా ఈ లక్ష్యాన్ని ఇటీవల 54 వేలకు పెంచాం. కౌలురైతులందరికీ సిసిఆర్‌సి ఇవ్వడానికి కృషి చేస్తాం.

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

హెల్పర్స్ ప్రమోషన్లలో రాజకీయ జోక్యాన్ని నివారించాలి

ప్రజాశక్తి-గుంటూరు

అంగన్‌వాడీ హెల్పర్ల ప్రమోషన్లలో రాజకీయ జోక్యం నివారించాలని కోరుతూ పోరాటానికి సిద్ధం కావాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎన్.రమాసుష్మ పిలుపునిచ్చారు. యూనియన్ నాయకులు కె.వెంకటరమణ అధ్యక్షతన ఆదివారం పాతగుంటూరు సిఐటియు జిల్లా కార్యలయంలో హెల్పర్స్ జిల్లా విస్తృత సమావేశం నిర్వహించారు. రమాసుష్మ మాట్లాడుతూ అంగన్‌వాడీ ఖాళీ పోస్టుల్లో అర్హులైన హెల్పర్లకు ప్రమోషన్లు ఇవ్వాల్సి ఉందని, కానీ జిల్లాలో అనేక చోట్ల ప్రజాప్రతినిధులు అవరోధం కలిగిస్తున్నారని అన్నారు. హెల్పర్లకు ప్రమోషన్లు ఇవ్వాలనే జీవోను అంగన్వాడీలు పెద్ద ఎత్తున పోరాడి సాధించుకున్నారని, ఉత్తర్వులు విడుదలైనా ప్రజా ప్రతినిధుల జోక్యంతో అర్హులకు ప్రమోషన్లు కోల్పోయే ప్రమాదం ఉందని చెప్పారు. హెల్పర్ల ప్రమోషన్లు చట్టబద్ధమైన హక్కు అని, ప్రజా ప్రతినిధుల దయాదాక్షిణ్యంపై ఆధారపడి ఇచ్చేవి కావని అన్నారు. కొందరు ప్రజాప్రతినిధులు తమ అనుయాయులకు చట్ట విరుద్ధంగా కట్టబెడుతున్నారని, ఈ అన్యాయాన్ని ప్రతిఘటిస్తూ జిల్లా వ్యాప్త ఉద్యమానికి అంగన్వాడి యూనియన్ సమాయత్తం అవుతోందని ప్రకటించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజీ మాట్లాడుతూ అంగన్వాడీ సెంటర్లలో మౌలిక వసతులు మెరుగుపరిచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం సిఐటియు జిల్లా అధ్యక్షులు డి.లక్ష్మీనారాయణ మాట్లాడారు.

మాట్లాడుతున్న రమాసుష్మ

పల్నాడులో అంబేద్కర్ భవన నిర్మాణానికి స్థల పరిశీలన

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

నూతనంగా ఏర్పడిన పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలో అంబేద్కర్ భవన నిర్మాణానికి స్థల సేకరణ కోసం పట్టణంలోని బాపనయ్య నగర్ వద్ద స్థలాన్ని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆదివారం పరిశీలించారు. రెవెన్యూ అధికారులు, మున్సిపల్ శాఖ సిబ్బంది సమన్వయంతో ప్రతిపాదన సిద్ధం చేసి త్వరితగతిన అందజేయాలన్నారు. ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించి జిల్లా కేంద్రంలో అంబేద్కర్ భవన నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. కలెక్టర్ వెంట తహశీల్దార్ రమణ నాయక్, టౌన్ ప్లానింగ్ అధికారి, సర్వేయర్ ఉన్నారు.

స్థానిక ప్రజలతో మాట్లాడుతున్న పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్